www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

PRGI.NO : APTEL /26/A4786

సంపుటి : 01 సంచిక : 35 పేజిలు : 08, వెల రూ. 1 రూ/ బుధవారం 15 - 07 - 2026

Published by EAST GODAVARI : Circulated by: East Godavari, Polavaram, Kakinada



సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

# అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు

- పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!
- ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం
- పాతకాలపు బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలకు సీఎం ఆదేశం
- ఫిర్యాదుల స్వీకరణకు క్రౌడ్ సోర్సింగ్ విధానాన్ని అమలు చేయాలి
- 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలని సూచన
- ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు
- 22ఏ భూ వివాదాలను పరిష్కరించి అవకాశాలు సృష్టించాలని దిశానిర్దేశం



**అమరావతి :** ప్రభుత్వ పాలనలో వేగం పెంచేందుకు, అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన ఆయన, అవసరం లేని, పాతబడిపోయిన 'బిజినెస్ రూల్స్'ను సంస్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నిబంధనలను సరళతరం చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు సరైన నాయకత్వంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు చేరతాయని స్పష్టం చేశారు. టెక్నాలజీని - మిగతా 2 లో



## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

- వైసీపీ అధినేత జగన్
- మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్
- మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం

**అమరావతి :** మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో - మిగతా 2 లో

## ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ



- ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పొడిగింపు
- గడువును జులై 24 వరకు పెంచుతూ ఈసీఐ నిర్ణయం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ విడుదల
- ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి
- సవరణ ప్రక్రియలో 14 లక్షల మంది మరణించినట్లు, 12 లక్షల మంది వలస వెళ్లినట్లు గుర్తింపు

**అమరావతి :** ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికానందున గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ - మిగతా 2 లో



## ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు.. అందుకే నాకు కోపం

- కవిత ఆసక్తికర వ్యాఖ్యలు
- చిన్న సినిమాలకు, నిర్మాతలకు అండగా ఉంటామని కల్వకుంట్ల కవిత హామీ
- భవిష్యత్తులో అధికారంలోకి వస్తే కొత్త సినీ పాలసీ తెస్తామని ప్రకటన
- 'మూడు రంగుల జెండా' పాటతో ఒకరు సీఎం అయ్యారంటూ ఆసక్తికర వ్యాఖ్య
- రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలమంతా ఒక్కటేనని పిలుపు

**హైదరాబాద్ :** చిన్న సినిమా నిర్మాతలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో తమకు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం లభిస్తే వారికి మేలు చేసేలా కొత్త సినీ విధానాన్ని తీసుకొస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన చరణ్ అర్జున్‌పై తనకు కాస్త కోపం ఉందని సరదాగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ, - మిగతా 2 లో

## అవమానించారు క్షమాపణ చెప్పాల్సిందే



- రాహుల్ గాంధీకి మెల్‌బోర్న్ నిర్వాహకుల ఘాటు లేఖ
- 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' సభపై కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన నిర్వాహకులు
- 'పెయిడ్ క్రౌడ్' వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని రాహుల్, ఖర్గేలకు డిమాండ్
- రాజకీయాల్లోకి ప్రవాస భారతీయులను లాగొద్దని బహిరంగ లేఖలో విజ్ఞప్తి

**ఢిల్లీ :** ఆస్ట్రేలియాలో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమానికి హాజరైన వేలాది మంది ప్రవాస భారతీయులను 'కిరాయి జనం' (పెయిడ్ క్రౌడ్) అని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ కార్యక్రమ నిర్వాహకులు లోక్‌సభ ప్రతిపక్ష నేత - మిగతా 2 లో



2 లో

## పీవోకేలో పాక్ దమనకాండ

- ఆరుగురు మృతి, భారత్ తీవ్ర విమర్శ
- పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీఓకే ప్రజల ఆందోళన
- పాక్ పోలీసులు, రేంజర్ల కాల్పుల్లో ఆరుగురు మృతి
- తమ ప్రాణాలు కాపాడాలని భారత్ కు పీవోకే ప్రజల విన్నపం

## భారత్ చుట్టూ విదేశీ నిఘా?

- భారత్ చుట్టూ విదేశీ పౌరుల వరుస ఘటనలు
- అమెరికన్, ఉక్రెయిన్ పౌరుల కేసులతో చర్చ
- నేపాల్ సరిహద్దులో అమెరికా పౌరుడు అరెస్టు
- మయన్మార్ కేసులో కొనసాగుతున్న ఎన్ఐఏ దర్యాప్తు



2 లో

## ఇది స్కూలా, లేక ఐఏఎస్, ఐపీఎస్ ఫ్యాక్టరీనా?

- ఝార్ఖండ్‌లో 'ఐఏఎస్ ఫ్యాక్టరీ'గా పేరొందిన నేతర్‌హాట్ స్కూల్
- ఈ స్కూల్ నుండి ఇప్పటివరకు సుమారు 3,000 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు
- ఈ పాఠశాలను ప్రశంసించిన తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్
- పలువురు మాజీ సీబీఐ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు ఇక్కడి పూర్వ విద్యార్థులే




2 లో

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం



- మంత్రి పొన్నం ప్రభాకర్
- కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్ కారణమన్న పొన్నం ప్రభాకర్
- మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శ
- ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని వెల్లడి

**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. - మిగతా 2 లో




## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

- కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య వివాదం
- శ్రీహరి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న సురేఖ
- సంయమనం పాటించాలన్న మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్ :** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. - మిగతా 2 లో

# అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి
- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన
- వేగంగా భూసేకరణ పూర్తి చేయడంపై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం



**హైదరాబాద్ :** అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

**వరంగల్ కీలకం**

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## అనిశ్చితిలో వెలుగురేఖ

'బలవంతుడ నాకేమని...' అనుకుంటే దశాబ్దాల తరబడి అమెరికా నిర్మించుకుంటూ వస్తున్న పునాదులు కదిలిపోతాయని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇంకా జ్ఞానో దయం కాలేదు. నాటో శిఖరాగ్ర సదస్సుకు పోయి ఈసారి కాస్తంత స్నేహపూర్వకంగా మాట్లాడినా అటువైపునుంచి మునుపటి సాన్నిహిత్యం లేదని తుర్కియేలో ముగిసిన ఆ సదస్సు తీరుతెన్నులు చెబుతున్నాయి. అమెరికాతో ఇప్పటికీ సన్నిహిత సంబంధాలే ఉన్న మన దేశం సైతం ఆయన తరచు చేసే ప్రకటనల కారణంగా ఇబ్బంది పడుతోంది. హఠాత్తుగా 'ఇండో--పసిఫిక్' పేరు మారాక లోలోన అసంతృప్తి సరేసరి. ఈ నేపథ్యంలో ఇండో--పసిఫిక్ విషయంలో మన వైఖరిని తేటతెల్లం చేసేలా, మన చొరవను మరింత పెంచేలా ప్రధాని నరేంద్ర మోదీ ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఆరు రోజుల పర్యటన ఈ నెల 6న మొదలైంది. ఇప్పటికే ఇండొనేసియా, ఆస్ట్రేలియా పర్యటనలు పూర్తి చేసుకున్న మోదీ శుక్రవారం న్యూజిలాండ్ చేరుకున్నారు. అమెరికా, చైనాలతో... వాటి వైఖరులతో సంబంధం లేకుండా భద్రత, వాణిజ్యం తదితర రంగాల్లో భిన్న దేశాల సహకారం అవసరమని మన దేశం భావించబట్టే ఈ పర్యటన ఖరారైంది. ఈ మూడూ సాగరప్రాంత దేశాలు. ఎప్పుడో 1992లోనే రూపుదిద్దుకున్న 'లుక్ ఈస్ట్' విధానానికి కొనసాగింపుగా మన దేశం 'మహాసాగర్' దార్శనికతను ప్రతిపాదించింది. పరస్పర సంపూర్ణ అభివృద్ధికి ప్రాంతాలవారీ భద్రత, సమగ్రవృద్ధి అవసరమన్నదిదాని సారాంశం. సాధారణ ఆర్థిక సంబంధాలు మొదలుకొని భారీ రక్షణ, ఇంధన భాగస్వామ్యం వరకూ అనేకం దీని పరిధిలోకొస్తాయి. ఆస్ట్రేలియాతో గురువారం కుదిరిన పౌర అణుశక్తి ఒప్పందం చరిత్రాత్మకమైనది. ఇదిగాక ఆధునిక సాంకేతికతలూ, రక్షణ, భద్రత సహకారం, సరఫరా గొలుసు మెరుగు పరచటం తదితరాలకు సంబంధించి మరో 18 ఒప్పందాలు కుదిరాయి. పారిస్‌ఒప్పందం కింద స్వచ్ఛ ఇంధన లక్ష్యం సాధనకు మన అణు రియాక్టర్లకు నిరంతరాయంగా యురేనియం అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న 7.7 గిగావాట్ల అణు విద్యుత్‌ను 2047కల్లా 100 గిగావాట్లకు పెంచాలని భారత్ నిర్దేశించుకుంది. ఇందుకోసం ప్రపంచ యురేనియం నిక్షేపాల్లో 28 శాతంగల ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదరటం కీలక పరిణామం. ప్రపంచ పరిణామాల కారణంగా హఠాత్తుగా నిలిచిపోతున్న ఇంధన సరఫరా తీరును సరిదిద్దటానికి ఎల్‌ఎన్‌జీ, బొగ్గు, డీజిల్‌వంటి సంప్రదాయ ఇంధన వనరుల విషయంలో పరస్పరం సహకరించుకుంటూ ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. ఏనాటి నుంచో సాన్నిహిత్యంగల ఇండొనేసియాతో మరిన్ని రంగాల్లో సహకారానికి ఈ నెల 6నుంచి 8వరకూ వరసగా మూడురోజులపాటు కొనసాగిన పర్యటనలో ఒప్పందాలు కుదిరాయి. మన బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల్ని కొనుగోలు చేయటానికి ఇండొనేసియా ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు దేశాలూ కలిసి ఇండొనేసియాలోని, అండమాన్, నికోబార్ దీవుల్లో నౌకాశ్రయాలను నిర్మించటానికి కూడా అధినేతలిద్దరూ అంగీకరించారు. అలాగే హిందూసముద్రం మొదలుకొని పసిఫిక్ మహాసముద్రంవరకూ పరస్పర సహకారంతో సముద్రజలాల్లో భద్రతను పెంచటానికి ఒప్పందం కుదిరింది. ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియాలతో ఉన్న సహకారానికి ఇండొనేసియా కూడా తోడుకావటం వల్ల ఇండో--పసిఫిక్‌లో పటిష్టమైన సమన్వయం ఏర్పడుతుంది. చైనాతో అంటకాగటానికిట్రంప్ ప్రయత్నిస్తున్న దశలో ఇది కీలక పరిణామం. నిరుడు మన దేశంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ పర్యటించినప్పుడు ద్వైపాక్షిక రక్షణ సహకార ఒప్పందం కుదిరింది. దాంతోపాటు మొన్న ఏప్రిల్‌లో రెండు దేశాలూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకున్నాయి. దీన్ని ముమ్మందు మరింత విస్తృతపర్చుకోవటానికి ఇప్పటికే ఇరు దేశాలూ నిర్ణయించుకున్నాయి. కూటముల్లో చేరే విషయంలో న్యూజిలాండ్‌కు పెద్దగా ఆసక్తి లేదు. అయితే ప్రాంతీయ భద్రతను పెంపొందించుకోవటానికి భారత్, ఆస్ట్రేలియాలతో కలిసి పనిచేయాలని ఇప్పటికే నిర్ణయించుకుంది. మొత్తానికి మోదీ మూడు దేశాల పర్యటన ఇండో--పసిఫిక్‌లో భారత్ పలుకుబడిని మరింత పెంచుతుంది.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

**మొదటిపేజీ తరువాయి -** బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

**మొదటిపేజీ తరువాయి -** ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయా లను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం

**మొదటిపేజీ తరువాయి -** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తావ ్న్నారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గత సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు ఇవ్వాలని కోరారు.

## పీవోకేలో పాక్ దమనకాండ

**మొదటిపేజీ తరువాయి -** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళన చేస్తున్న నిరసనకారులపై పాక్ పోలీసులు, రేంజర్లు కాల్పులు జరపడంతో ఆరుగురు మృతి చెందారు. పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయపడ్డారు. కొంతకాలంగా పీవోకేలో ఇంటర్నెట్ నిలిపివేయడంతో దాదాపు 40 లక్షల మంది ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని నిరసనకారులు తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పీవోకే ప్రజలు వాపోతున్నారు. తమ ప్రాణాలను కాపాడాలని, మానవతా సాయం అందించాలని భారత్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. పూంఛ్, దోడా సెక్టార్లలో నియంత్రణ రేఖను తెరవాలని కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలపై పాక్ అణచివేత ధోరణిని భారత్ తీవ్రంగా విమర్శించింది. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న వ్యవస్థాగత దోపిడీ, బలవంతపు ఆక్రమణలు, అణచివేత వల్లే ఈ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఆహారం, మందుల సరఫరా నిలిపివేత, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్, తీవ్ర హింస పాక్ క్రూరత్వానికి నిదర్శనమని విమర్శించారు. అటు, అమెరికాలో స్థిరపడిన పీవోకే పౌరులు వైట్‌హౌస్ ముందు నిరసన చేపట్టారు. ఈ ఘటనలు పాక్ ఆక్రమణకు వ్యతిరేకంగా పీవోకేలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి.

## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

**మొదటిపేజీ తరువాయి -** మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

# అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు

**మొదటిపేజీ తరువాయి -** అనుసంధానం చేస్తూ పాలనలో పారదర్శకత తీసుకురావాలని సూచించారు. 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి 20 శాతం వృద్ధి సాధించిందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలన్నారు.

### దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా మార్చాలి

దేవాదాయ శాఖపై సమీక్షలో భాగంగా రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ ఆలయాల పరిసరాల్లో ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. అదేవిధంగా, ఆర్టీసీ బస్సులు సరైన సమయానికి నడిచేలా చూడాలని, బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ సేవల ప్రమాణాలను పెంచాలని, రాష్ట్రంలో యూరియా కొరత రాకుండా రైతులకు భరోసా ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

### ఫిర్యాదుల పరిష్కారానికి క్రౌడ్ సోర్సింగ్

ప్రభుత్వానికి వచ్చే అన్ని ఫిర్యాదుల స్వీకరణకు 'క్రౌడ్ సోర్సింగ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి అర్జీని మానవీయ కోణంలో పరిశీలించి, వేగంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ జాబితాలో చేర్చారని, ఇలాంటి వివాదాలను పరిష్కరించడం ద్వారా ఎన్నో అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. శెట్టిపల్లి భూ వివాదం పరిష్కారంతో ప్రభుత్వానికి రూ.900 కోట్ల విలువైన భూమి రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర వర్చువల్‌గా పాల్గొనగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు



పాల్గొన్నారు. ఈ సమీక్ష అనంతరం, ఆర్టీజీఎస్ రూపొందించిన 'గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్' మాసపత్రికను సీఎం ఆవిష్కరించారు.

# ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ

**మొదటిపేజీ తరువాయి -** సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

### గడువు పెంపునకు దారితీసిన కారణాలు

గత నెల రోజులుగా ఏపీ వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూసే ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టారు. జులై 13 నాటికి దాదాపు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో, గడువును పొడిగించాలని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరాయి. పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీఈవో.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ఈసీఐ, గడువు పొడిగింపునకు అంగీకారం తెలిపింది.

### సవరణలో వెల్లడైన కీలక గణాంకాలు

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు మొత్తం 4,16,26,144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. సోమవారం నాటికి 3,69,50,812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశారు. ఈ ప్రక్రియలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 మంది ఓటర్లు మరణించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో 12,14,994 మంది ఓటర్లు తమ చిరునామా నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తేలింది. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లిన సమయంలో 7,26,425 మంది ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేరని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 9 శాతానికి పైగా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో, పొడిగించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

### సవరించిన షెడ్యూల్ వివరాలు

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం సవరించిన తేదీలు ఈ విధంగా ఉన్నాయి:

- ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి తేదీ: జులై 24
- ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ: జులై 31
- అభ్యంతరాలు, చేర్పులు, మార్పుల స్వీకరణ: జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు
- అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి గడువు: సెప్టెంబరు 28
- ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ: అక్టోబరు 3

ఈ పొడిగించిన గడువుతో ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు అవకాశం లభించిందని అధికారులు భావిస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత పౌరులు తమ వివరాలను సరిచూసుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత సమయంలోగా తెలియజేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

## ఇది స్కూలా, లేక ఐఏఎస్, ఐపీఎస్ ఫ్యాక్టరీనా?




**మొదటిపేజీ తరువాయి -** ఝార్ఖండ్ రాష్ట్రం లతేహార్ జిల్లాలోని నేతర్‌హాట్ రెసిడెన్షియల్ స్కూల్ దేశవ్యాప్తంగా 'ఐఏఎస్ ఫ్యాక్టరీ'గా విశేష ఖ్యాతి గడించింది. నాణ్యమైన విద్యకు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిలయమైన ఈ పాఠశాల, ఇప్పటివరకు సుమారు 3,000 మందికి పైగా ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీస్ అధికారులను దేశానికి అందించింది. విద్యా ప్రమాణాలకు, విద్యార్థుల క్రమశిక్షణకు ఈ సంస్థ ఒక చిరునామాగా నిలుస్తోం ది. స్వాతంత్ర్యానంతరం ఏర్పాటైన ఈ విద్యాసంస్థ, తన విశిష్టమైన రెసిడెన్షియల్ విద్యావిధానంతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఝార్ఖండ్‌తో పాటు పరిసర రాష్ట్రాల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఇక్కడ చేర్పిం చడాన్ని ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక రాజమార్గంగా భావిస్తారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సైతం ఈ పాఠశాల విద్యావిధానాన్ని ప్రశంసించడమే కాకుండా, నైనిటాల్ లోనూ ఇటువంటి పాఠశాలనే ఏర్పాటు చేయాలని నాడు సూచిం చారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు నేడు దేశవిదేశాల్లో అత్యున్నత హోదాల్లో కొనసాగుతున్నారు. సుప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త వశిష్ట నారాయణ్ సింగ్, సీబీఐ మాజీ డైరెక్టర్లు డాక్టర్ త్రినాథ్ మిశ్రా, డాక్టర్ రాకేశ్ అస్థానా, కేంద్ర మాజీ హోం కార్యదర్శి జేబీ తుబిడ్, ఐఏఎస్ అధికారి మనీశ్ రంజన్ వంటి ఎందరో ప్రముఖులు ఇక్కడ చదువుకున్నవారే. కేవలం సివిల్ సర్వీసెస్ మాత్రమే కాకుండా, వైద్య, ఇంజినీరింగ్, పరిపాలన వంటి వివిధ రంగాల్లోనూ వీరు విశేష ప్రతిభను చాటుతున్నారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడే కొండల నడు మ నెలకొన్న ఈ పాఠశాల ప్రాంగణం, అక్కడి వారసత్వ కట్ట డాలు పర్యాటకులను సైతం విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన ఎందరో విద్యార్థుల కలలను సాకారం చేస్తూ, నాణ్య మైన విద్యాశక్తికి ఈ సంస్థ ఒక నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

## ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు.. అందుకే నాకు కోపం

**మొదటిపేజీ తరువాయి -** సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించాయి. దినేశ్ కుమార్, దివిజ ప్రభాకర్ జంటగా నటించిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చరణ్ అర్జున్‌ను కవిత ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన అద్భుతమైన సంగీతాన్ని అందిస్తారని కొనియాడుతూ.. "చరణ్ అర్జున్ స్వరపరిచిన 'మూడు రంగుల జెండా' పాట ఒక వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది. అంతటి శక్తిమంతమైన పాటను అందించినందుకు ఆయనపై నాకు కాస్త అలక, కోపం వున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సినిమా పాటలు కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. భౌగోళికంగా రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలంతా ఒక్కటేనని, మనమంతా కలిసి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఇరు ప్రాంతాల సంస్కృతులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే భాష, సంస్కృతి నిలబడతాయని, తెలుగు చిత్రసీమ మనందరినీ కలిపే ఒక గొప్ప మాధ్యమంగా ఉండాలని పిలుపునిచ్చారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై కవిత తన ప్రసంగంలో ప్రధానంగా దృష్టి సారించారు. "తమిళ, కన్నడ పరిశ్రమల మాదిరిగా మన దగ్గర చిన్న నిర్మాతలకు, థియేటర్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేవు. ఎంతో ప్రతిభ ఉన్నా సరైన అవకాశాలు దక్కడం లేదు. ఓటీటీల రాకతో మేలు జరుగుతుందని ఆశించినా, అవి కూడా పూర్తిగా వ్యాపార ధోరణిలోనే నడుస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు అమ్మి, సర్వస్వం పణంగా పెట్టి సినిమాలు తీసే చిన్న నిర్మాతలు బాగుంటేనే చిత్ర పరిశ్రమ మనుగడ సాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. "చిన్న నిర్మాతలకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుంది. భవిష్యత్తులో మాకు అధికారం వస్తే, తప్పకుండా చిన్న చిత్రాలకు ప్రయోజనం చేకూరేలా సరికొత్త సినీ విధానాన్ని రూపొందిస్తాం" అని కవిత హామీ ఇచ్చారు. కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రంలో దినేశ్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. సతీశ్ ఆవాల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది.

## అవమానించారు.. క్షమాపణ చెప్పాల్సిందే

**మొదటిపేజీ తరువాయి -** రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకుని, ఆస్ట్రేలియాలోని భారత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. జులై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం కోసం 30,000 మందికి పైగా ప్రవాస భారతీయులు తరలివచ్చారు. ఆస్ట్రేలియాలో ఒక విదేశీ నేతకు లభించిన అతిపెద్ద స్వాగతాల్లో ఇది ఒకటిగా నిలిచింది. అయితే, ఈ కార్యక్రమానికి హాజరైన వారిని బీజేపీ లేదా భారత ప్రభుత్వం డబ్బులిచ్చి సమీకరించిందని కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రవాస భారతీయులను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని నిర్వాహకులు తమ లేఖలో పేర్కొన్నారు. "ఈ కార్యక్రమం ఆస్ట్రేలియాలోని భారత సమాజం స్వచ్ఛందంగా, ఎంతో ఉత్సాహంగా చేసుకున్న వేడుక. దీనికి ఎలాంటి రాజకీయ పార్టీ లేదా ప్రభుత్వం నిధులు సమకూర్చలేదు. సిడ్నీ వంటి ఇతర నగరాల నుంచి వచ్చిన వారి కోసం 'మోదీ ఎయిర్‌వేస్' పేరుతో ఏర్పాటు చేసిన విమాన ప్రయాణాలు కూడా వాలంటీర్ల ఆధ్వర్యంలో, ప్రయాణికులు సొంత ఖర్చులతో చేసుకున్నవే" అని వారు స్పష్టం చేశారు. వృత్తి నిపుణులు, కుటుంబాలు, విద్యార్థులు, వృద్ధులు ఎంతో ఆసక్తితో, సొంత డబ్బు, సమయాన్ని వెచ్చించి ఈ చారిత్రక కార్యక్రమంలో పాలుపంచుకున్నారని నిర్వాహకులు వివరించారు. "ప్రధాని మోదీని విమర్శించే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఉంది. కానీ, ఆ విమర్శల కోసం వేలాది మంది ప్రవాస భారతీయుల స్వాతంత్ర్యాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరచడం సరికాదు. ప్రవాస భారతీయులు రాజకీయ పార్టీల చేతిలో కీలుబొమ్మలు కాదు. వారు తమ వారసత్వాన్ని జరుపుకోవడానికి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుడికి స్వాగతం పలకడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు" అని లేఖలో పేర్కొన్నారు. తమ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అంగీకరించి, వాటిని వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని నిర్వాహకులు డిమాండ్ చేశారు. "దేశీయ రాజకీయాల్లో ప్రవాస భారతీయులను అనవసరంగా లాగవద్దు. మీ ఆరోపణలు వేలాది మంది వాలంటీర్ల శ్రమను, సొంత ఖర్చులతో వచ్చిన ప్రతి కుటుంబాన్ని, సెలవు పెట్టి మరీ వచ్చిన ప్రతి ఉద్యోగిని అవమానించేలా ఉన్నాయి. ఈ తప్పుడు ఆరోపణలను సరిదిద్దుకుని, మా సమాజానికి క్షమాపణ చెబుతారని ఆశిస్తున్నాం"అని వారు లేఖలో రాసుకొచ్చారు.

## భారత్ చుట్టూ విదేశీ నిఘా?

**మొదటిపేజీ తరువాయి -**

భారత్‌తో పాటు దక్షిణాసియా ప్రాంతంలో విదేశీ పౌరులకు సంబంధించిన వరుస ఘటనలు భద్రతా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల అమెరికా, ఉక్రెయిన్‌కు చెందిన వ్యక్తుల అరెస్టులు, బంగ్లాదేశ్‌లో అమెరికా ప్రత్యేక దళాల అధికారి అనుమానాస్పద మృతి వంటి పరిణామాలు ప్రాంతీయ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ఈ ఘటనల మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని ఇప్పటివరకు ఏ అధికారిక సంస్థ కూడా నిర్ధారించలేదు.

### నేపాల్ సరిహద్దులో అమెరికా పౌరుడు

ఈ నెల ఉత్తరప్రదేశ్‌లోని సోనౌలి సరిహద్దు వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా నేపాల్‌లోకి వెళ్లేందుకు యత్నించిన అమెరికా పౌరుడు జోర్డాన్ బ్రౌన్‌ను సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) అదుపులోకి తీసుకుంది. తాను గతంలో అమెరికా నేవీ, స్పెషల్ ఫోర్సెస్‌లో పనిచేశానని అతడు చెబుతున్నాడు. కానీ, దానికి సంబంధించిన ఆధారాలు చూపలేకపోయాడు. అతడి నుంచి నగదు, మొబైల్ ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### వాన్‌డైక్ కేసు మరో చర్చ

ఈ ఏడాది మార్చిలో అమెరికా పౌరుడు మాథ్యూ ఆరోన్ వాన్‌డైక్‌తో పాటు ఆరుగురు ఉక్రెయిన్ పౌరులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. వీరు భారత్‌ను మధ్యేమార్గంగా ఉపయోగించుకుంటూ మయన్మార్‌లోని స్థానిక సాయుధ వర్గాలకు డ్రోన్లు, సైనిక శిక్షణ అందించినట్లు దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. స్వాధీనం చేసుకున్న పరికరాల్లో డ్రోన్ శిక్షణకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు లభించినట్లు సమాచారం. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

### నిపుణుల హెచ్చరిక ఇదే

ఈ ఘటనలు పరస్పరం సంబంధం ఉన్నాయని చెప్పేందుకు ప్రస్తుతం అధికారిక ఆధారాలు లేవు. కానీ, ఇలాంటి పరిణామాలు సరిహద్దు భద్రత, నిఘా వ్యవస్థలు, దేశాల మధ్య ఇంటెలిజెన్స్ సమాచార మార్పిడిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఇలాంటి ఘటనలపై పారదర్శక దర్యాప్తు జరగడం కూడా కీలకమని సూచిస్తున్నారు.

## అపార్ట్‌మెంట్ ధర రూ.2.5 కోట్లు , బాల్కనీ దృశ్యం 'ధోబీ ఘాట్'లా ఉందని విమర్శలు !

### ముంబై లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో బట్టల ఆరవేతపై దుమారం

### కోట్లు పెట్టి కొన్నా చావిడిలా ఉందంటూ నెటిజన్ల విమర్శలు

### సోషల్ మీడియాలో ఫొటో వైరల్ కావడంతో రెండు వర్గాలుగా చీలిన నెటిజన్లు

### ఇది సాధారణమేనని, ఎండకు ఆరేయడమే మంచిదని మరికొందరి వాదన

ముంబైలో నూతనంగా నిర్మించిన ఒక లగ్జరీ అపార్ట్‌మెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2.5 కోట్ల వరకు విలువ చేసే ఈ ఫ్లాట్ల బాల్కనీలలో నివాసితులు బట్టలు ఆరవేయడం ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. బాల్కనీల నుండి వేలాడుతున్న బట్టల ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, కొందరు దీనిని ముంబైలోని ప్రసిద్ధ 'ధోబీఘాట్'తో మరియు పాతకాలపు 'చావిడి' (సామూహిక నివాస గృహాలు) సంస్కృతితో పోలుస్తూ విమర్శిస్తున్నారు. జులై 12న 'ఏ=శ్ఘుంయాటవీబఎమ్ఘఱ' అనే 'ఎక్స్' వేదికగా షేర్ చేసిన ఒక ఫొటోతో ఈ వివాదం మొదలైంది. "కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్‌కు ఇలా చావిడి రూపును తీసుకువచ్చారు" అని సదరు పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. భవనం యొక్క బాహ్య సౌందర్యం దెబ్బతినకుండా ఉండేందుకు, బిల్డర్లు ప్రతి అంతస్తులో బట్టలు ఆరవేసుకోవడానికి ప్రత్యేక స్థలాన్ని ఎందుకు కేటాయించలేదని ఆ యూజర్ ప్రశ్నించారు. ఈ పోస్ట్ స్వల్ప కాలంలోనే వైరల్ కావడంతో నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. అత్యంత ఖరీదైన ఫ్లాట్లలో ఇలా బట్టలు ఆరవేయడం భవనం శోభను తగ్గిస్తుందని కొందరు అభిప్రాయపడగా, మరికొందరు మాత్రం ఈ చర్యను సమర్థించారు. ముంబైలోని



తేమతో కూడిన వాతావరణంలో బట్టలను ఎండలో ఆరవేయడమే అత్యుత్తమమని, ఇది సహజమైన మరియు పర్యావరణ అనుకూలమైన పద్ధతి అని పేర్కొన్నారు. స్పెయిన్, ఇటలీ వంటి యూరప్ దేశాల్లోనూ ఇది సర్వసాధారణమని గుర్తుచేశారు. కాగా, కొన్ని ఫ్లాట్లలో బాల్కనీలు చాలా ఇరుకుగా ఉండటం, ఇప్పటికే అక్కడ ఏసీ యూనిట్లు అమర్చడం వల్ల బట్టలు ఆరవేసేందుకు మరో మార్గం లేదని మరికొందరు వాపోయారు.

# ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజాస్వామ్యం ఖూనీ.. అస్సాగో ఇథనాల్ పరిశ్రమ విస్తరణను అడ్డుకుంటాం.!

### పాటంశెట్టి సూర్యచంద్ర ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి

**గోకవరం,జులై 14 .అక్షర టైమ్స్ :** జగ్గంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ అండదండలతో స్థానిక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ సాగుతున్న అరాచక పాలనపై తక్షణమే చర్యలు చేపట్టాలని సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గోకవరం మండలం, గుమ్మళ్ళదొడ్డి గ్రామంలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 2 లక్షల లీటర్ల నుండి 3 లక్షల లీటర్ల తయారీ పెంచేందుకు నేడు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ (గ్రామసభ) కేవలం ఒక ప్రహసనంగా మారిందన్నారు.?ప్రజల పక్షాన నిలబడి వారి గొంతుకను వినిపించడానికి సిద్ధమైన మమ్మల్ని పోలీసు బలగాలతో నిర్బంధించిన దుర్మార్గమైన చర్యని పాటంశెట్టి సూర్యచంద్ర తీవ్రంగా ఖండించారు.

**ప్రజాస్వామ్య హక్కుల కాలరాత:**

ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో మాట్లాడే కనీస హక్కును కూడా నిరాకరిస్తూ, పోలీసులను అడ్డుపెట్టుకుని సభను జరపడం ఎంతవరకు సమంజసం? మేమేమీ తీవ్రవాదులం కాదు, చట్టాన్ని గౌరవించే పౌరులం. మా గొంతు నొక్కడం ద్వారా ప్రభుత్వం ఏ అరాచకాన్ని దాచాలని చూస్తోందని ప్రభుత్వాన్ని సూర్యచంద్ర ప్రశ్నించారు

**పర్యావరణ విధ్వంసం:**

ఇప్పటికే ఉన్న పరిశ్రమ వల్ల శబ్ద, వాయు, జల కాలుష్యం తీవ్రస్థాయికి చేరింది. ఒక లీటర్ ఇథనాల్ తయారీకి ఏకంగా 5 లీటర్ల భూగర్భ జలాలు అవసరమవుతున్నాయి. అంటే నిత్యం సుమారు 15 లక్షల లీటర్ల నీటిని తోడేస్తూ ఉంటే, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో వ్యవసాయం నిర్వీర్యమై, తాగునీటి కటకట ఏర్పడటం ఖాయమన్నారు.



**భయంకరమైన కాలుష్యం:**

నిత్యం సుమారు 225 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ (CO_2) ప్రమాదకరమైన కాలుష్యం గాలిలోకి విడుదలవుతుండటం వల్ల వాతావరణం కలుషితమై స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు.

**స్థానిక ఎమ్మెల్యే ద్వంద్వ విధానాలు:**

నాడు ఎన్నికల ప్రచారంలో "ఈ ఫ్యాక్టరీని రద్దు చేస్తాం" అని ప్రగల్భాలు పలికిన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారు మరియు వారి కుమారుడు జ్యోతుల నవీన్ ఎక్కడికి వెళ్లారన్నారు.ప్రజలు ఇంతగా అల్లాడుతుంటే, తిరుపతిలో బోర్డు మీటింగ్ ఉందంటూ తప్పించుకుపోవడం వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటన్నారు.అస్సాగో యాజమాన్యం నుండి ఎన్ని కోట్లు ముట్టాయని ఈరోజు ఈ రకమైన పారిపోకడలకు పాల్పడుతున్నారని సూర్యచంద్ర ప్రశ్నించారు



**"స్వచ్ఛమైన గాలి..స్వచ్ఛమైన నీరు.. స్వచ్ఛమైన పరిసరాలు ప్రజల హక్కు!"**

పచ్చని ప్రకృతిని,ఆరోగ్యవంతంగా ఉన్న పర్యావరణాన్ని? పాడుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తక్షణమే ఇక్కడి నుండి తరలించాలని,అధికార పార్టీ అరాచకాలకు, ప్రభుత్వ నిర్బంధాలకు భయపడమని,రాబోయే రోజుల్లో ప్రజా ఆగ్రహానికి ఈ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని సూర్యచంద్ర తెలిపారు.

# అస్సాగోని తరిమికొట్టాలి

### బాధితులను ఆదుకోవాలి

### ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల మొర

**గోకవరం,జులై 14 .అక్షర టైమ్స్ :** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం, గుమ్మళ్ళదొడ్డిలో మంగళవారం అస్సాగో బాధితులు తమ నిరసనను మరొక్కసారి వ్యక్తపరిచారు. అస్సాగో యాజమాన్యం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే యోచనతో చేసుకున్న దరఖాస్తుపై రాజమహేంద్రవరం ఆర్డీవో శివరాముడు నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో గుమ్మళ్ళదొడ్డి, బావాజీపేట, వెదురుపాక, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, కంపెనీ వల్ల ఇప్పటికే తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు తెలియజేశారు.

**కంపెనీ పార్కింగ్ స్థలంలో ఏర్పాటు పై మండిపాటు**

ప్రభుత్వ అధికారులు నిర్వహించాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వ స్థలాలు గాని, ప్రభుత్వ కార్యాలయాలు గాని లేవా అంటూ స్థానికులు మండిపడ్డారు. అస్సాగో కంపెనీకి సంబంధించిన పార్కింగ్ స్థలంలో ఈ సమావేశం ఏర్పాటు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అధికారులే తమ గ్రామాన్ని అస్సాగో కంపెనీకి అమ్మేశారు అనడానికి కార్యక్రమం నిర్వహణ వేదికే నిదర్శనమని స్థానిక యువత మండిపడ్డారు.

**భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి**

ఇప్పటికే నిత్యం పది లక్షల లీటర్ల వరకు నీటిని భారీ మోటార్ల సహాయంతో భూగర్భ జలాలను కంపెనీలో వినియోగిస్తున్నారని, ఫలితంగా తమ గ్రామంలో బోరు బావులు పనిచేయడం లేదని, తాగు సాగు నీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడుతుందని స్థానిక రైతులు అధికారుల ముందు కన్నీటి పర్యంతమయ్యారు.

**నిత్యం 157 టన్నుల కార్బన్డయాక్సైడ్ ఏమవుతుంది**

ఇప్పటివరకు తయారవుతున్న ఇతనాల్ వల్ల సుమారు 157 టన్నుల కార్బన్డయాక్సైడ్ విడుదలవుతున్నట్లు కంపెనీ యాజమాన్యం ఒప్పుకుందని, కానీ ఈ కార్బన్ డయాక్సైడ్ ను పరిసర ప్రాంతాల్లోనే విడిచిపెట్టడం తీవ్ర భయాందోళనకు గురిచేస్తుందని గ్రామస్తులు అధికారులకు వివరించారు. కంపెనీని మరింత విస్తరింప చేస్తే వాయు కాలుష్యంతో పరిసర ప్రాంతం క్యాన్సర్ కారక రోగాలతో నిత్యం మరణాలు సంభవిస్తాయని విద్యావేత్తలు అభిప్రాయం పడ్డారు.

**భారీ శబ్దాలతో భయభ్రాంతులకు గురవుతున్నాము**

రాత్రి సమయంలో కంపెనీ నుండి వస్తున్న భారీ శబ్దాల వల్ల తీవ్ర భయాందోళన గురవుతున్నామని, చిన్నారులు నిద్రపోకుండా ఏడుస్తున్నారని కంపెనీ సమీపంలోని దళిత పేటకు చెందిన మహిళలు అధికారులకు తెలియజేశారు.



**పోలీసుల తీరు పై విమర్శలు**

ఒకపక్క అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చి, తమ అభిప్రాయాలను తెలియజేయాలని ప్రచారం చేస్తే, పోలీసులు మాత్రం దౌర్జన్యంగా కొందరిని హౌస్ అరెస్టులు చేయడంపై గ్రామస్తులు తీవ్రస్థాయిలో పోలీసులను తప్పుపట్టారు. ప్రజాస్వామ్యంలో ఉన్న తమకు తమ సమస్యలను అధికారులకు తెలియజేసుకునే భావ ప్రకటన స్వేచ్ఛ కూడా లేకుండా పోలీసులు ప్రవర్తిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా స్థానికులపై కేసులు పెట్టి బెదిరింపు ధరణిలో పోలీసుల వ్యవహార శైలిని గ్రామస్తులు వ్యతిరేకించారు.

**స్మశానంలో 30మంది కి ఉద్యోగాలు**

కేవలం ఒకరిద్దరి లాభాల కోసం, నాలుగు గ్రామాలను స్మశానాలుగా మార్చి, 30 మందికి ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పడం చాలా దారుణమని స్థానికులు అధికారులకు తెలిపారు. ఐవోసీఎల్, హెచ్పిసిఎల్ ప్లాంట్లను ఆనుకొని నిత్యం నిప్పుల కొలిమితో ఉండే ఇతనాల్ ప్లాంట్ కు ఏ విధంగా అనుమతులు మంజూరు చేశారని, ఆర్డీవో శివరాముడిని స్థానికులు ప్రశ్నించారు.

**దశలవారీగా ఉద్యమం ప్రారంభం**

ఇప్పటికే ఉన్న కంపెనీ వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ కంపెనీని ఇక్కడి నుండి తరలించడానికి త్వరలో దశలవారీగా ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తామని, కంపెనీ సామర్థ్యాన్ని పెంచడానికి ఏ విధమైన అనుమతులు ఇవ్వకూడదని అధికారులకు తెలియజేశారు.

**ఆర్డీవో ఎదుట బాధితుల నిరసన**

తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఆర్డిఓ శివరాముడికి తెలియజేసిన అనంతరం, స్టేజిపైనే గుమ్మళ్ళదొడ్డికి చెందిన కొందరు నిరసన గళాన్ని విడిపించారు. కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు.

**కార్యక్రమం మధ్యలోనే వెనుదిరిగిన బాధితులు**

కంపెనీ సమీప గ్రామాలకు చెందిన బాధితులు అందరూ ప్రజాభిప్రాయసేకరణలో పాల్గొని, తమ సమస్యలను అధికారులకు తెలియజేసిన వెంటనే కార్యక్రమాన్ని వ్యతికిస్తూ, నినాదాలు చేసుకుంటూ, సభా ప్రాంగణం నుండి వెనుదిరిగారు. దీనితో కార్యక్రమం రసాభాసగా మారింది.

**అస్సాగో సిబ్బంది కుప్పిగంతులు బట్టబయలు అయ్యాయి**

ప్రజాభిప్రాయ సేకరణలో అస్సాగో సిబ్బంది కుప్పిగంతులు బట్టబయలు అయ్యాయి. ఈ కంపెనీతో తమకు చాలా లాభాలు ఉన్నాయని గుమ్మళ్లదొడ్డికి చెందిన ఒక మహిళ మాట్లాడటానికి ప్రయత్నించగా, బాధితులు అడ్డుకున్నారు. ఆ మహిళ అదే కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తుందని, వారందరికీ కంపెనీ యాజమాన్యం ముందుగానే స్క్రిప్ట్ రాసి ఇచ్చిందని అధికారులకు తెలియజేశారు. దీంతో ఆ మహిళతో పాటుగా, అచ్చుతాపురం కి చెందిన మరొక ఉద్యోగి మాట్లాడకుండానే వెనుతిరిగాడు. కంపెనీ సిబ్బంది ఇంత దిగజారి ప్రవర్తించడం పట్ల అధికారులు సైతం సైలెంట్ గా ఉండిపోయారు.

**విందు భోజనాలతో మెప్పు పొందే ప్రయత్నం**

అస్సాగో సిబ్బంది మాత్రం, ప్రజాభిప్రాయ సేకరణలో తీవ్ర విమర్శలు ఎదుర్కొని, గ్రామాలను స్మశానాలుగా మార్చద్దని స్థానికులు కన్నీటి పర్యటమైనప్పటికీ, తమ బాస్ మెప్పుకోసం ఒకరిద్దరు ఉద్యోగులు విందు భోజనాలు ఏర్పాటు చేసి, గ్రామస్తులను తినమని బ్రతిమాలారు. స్థానికులు తినకపోవడంతో, ప్రధాన రహదారిపై వెళ్లే ప్రయాణికులను ఆపి మరీ భోజనాలు పెట్టారు.

# దేవి ప్రసాద్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఘన ముగింపు

### విజేతగా ఈలకొలను (రాజానగరం) జట్టు.. రన్నరప్‌గా గుమ్మల్లదొడ్డి (గోకవరం) జట్టు

### బహుమతులు అందజేసిన యువ నాయకుడు సూర్య మణికంఠ

**గోకవరం,జులై 14 .అక్షర టైమ్స్ :** గోకవరం మండలంలోని డ్రైవర్స్ కాలనీలో నిర్వహించిన దేవి ప్రసాద్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ముగిసింది. జూన్ 3న ఎంకే టీం అధినేత కర్రి సూర్య మణికంఠ ఆర్థిక సహకారంతో ప్రారంభమైన ఈ పోటీల్లో పలువురు యువ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఈలకొలను (రాజానగరం) జట్టు విజేతగా నిలవగా, గుమ్మల్లదొడ్డి (గోకవరం) జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.60 వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.25 వేల నగదు బహుమతిని కర్రి సూర్య మణికంఠ అందజేశారు. అదేవిధంగా మూడో స్థానంలో నిలిచిన గోకవరం సీనియర్స్ జట్టుకు రూ.7,500, నాలుగో స్థానంలో నిలిచిన గోకవరం జూనియర్స్ జట్టుకు రూ.5,500 నగదు బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్ అవార్డులతో పాటు ట్రోఫీలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కర్రి సూర్య మణికంఠ మాట్లాడుతూ, తన సోదరుడు దేవి ప్రసాద్ జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఉద్దేశంతో ఇటువంటి పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ టోర్నమెంట్ విజయవంతం కావడంలో ఆర్గనైజర్లను ఆయన అభినందించారు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సహకారం ఉంటే భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.





# అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది

**గోకవరం,జులై 14 .అక్షర టైమ్స్ :** గుమ్మళ్లదొడ్డి గ్రామ పరిధిలోని అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 200 కె ఎల్ పి డి నుంచి 300 కె ఎల్ పి డి కి విస్తరించేందుకు నిర్వహించిన ప్రజా విచారణ కార్యక్రమం సంబంధిత అధికారుల సమక్షంలో జరిగింది.ఈ ప్రజా విచారణకు ఆర్‌డీవో, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (ఏపిపిసిబి) ఈఈ మేడం,జాయింట్ డైరెక్టర్ (జేడీ ),ఎంఆర్ఓ హాజరై ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు.ప్రజా విచారణ సందర్భంగా గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన కొంతమంది గ్రామస్తులు స్థానిక ఉపాధి అవకాశాలు, వాసన, శబ్ద కాలుష్యం, బోర్‌వెల్ నీటి



వినియోగంపై తమ అభ్యంతరాలు, సందేహాలను వ్యక్తం చేశారు. ఈ అంశాలపై అస్సాగో ఇండస్ట్రీస్ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. విస్తరణ అనంతరం స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అలాగే వాసన నివారణ కోసం ఆధునిక వాసన చికిత్స ఒడర్ ట్రీట్మెంట్ పరికరాలను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు వివరించింది. భూగర్భ జలాలను వినియోగించకుండా పుష్కర కాలువ నుంచి పరితల జలాలను వినియోగించేందుకు అవసరమైన అనుమతులు పొందినట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. అదేవిధంగా బావాజీపేట, వేదురుపాక, అచ్చుతాపురం గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజా విచారణలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ గ్రామాల ప్రజల్లో కొందరు సంస్థ విస్తరణకు మద్దతు తెలపగా, మరికొందరు పర్యావరణ పరిరక్షణ అంశాలపై సూచనలు, అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మొత్తంగా ఈ గ్రామాల ప్రజల నుంచి సంస్థ పట్ల మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ప్రజా విచారణలో అధికారులు ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను నమోదు చేసి, సంబంధిత నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ని కలిసిన ప్రజా సంఘ నాయకులు



**విజయవాడ,జులై 14 .అక్షర టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్ ను ఏపీ ఆర్టీసీ ప్రజా సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా విజయవాడలో ఆయన కార్యాలయంలో శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీలో ఎస్సీ కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి ప్రజా సంఘ నాయకులు తీసుకువెళ్లారు. ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించి ఏపీ ఆర్టీసీలో ఎస్సీ కార్మికుల కు అండగా ఉంటానని హామీ ఇచ్చారని ఆర్టీసీ ప్రజా సంఘ నాయకులు తెలియజేశారు.చిర్రా శ్యామ్సన్, ఏవీ రాజు, తాడిమల్ల కిష్టాపర్, కే పి కుమార్, తదితరులు కె ఎస్ జవహర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## రాజమండ్రి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన బొడ్డు వెంకటరమణ చౌదరి గారు





**రాజమహేంద్రవరం,జులై 14 .అక్షర టైమ్స్ :** రాజమండ్రి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయ నిర్మాణ పనులను ఈరోజు రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత బాధ్యులకు సూచించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులకు అన్ని విధాలా ఉపయోగపడేలా ఆధునిక సౌకర్యాలతో కార్యాలయాన్ని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యాలయం ఒక సమన్వయ వేదికగా నిలిచి, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## గోకవరం మండలంలోని పలు ప్రభుత్వ హాస్టల్స్ లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది





**గోకవరం,జులై 14 .అక్షర టైమ్స్ :** గోకవరం మండలంలోని పలు ప్రభుత్వ హాస్టల్స్ లో వైద్య సిబ్బంది విద్యార్థులు కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం జి. కొత్తపల్లి పి . హెచ్. సి వైద్యధికారులు డా. తిరన్, డా. నిఖిత పర్యవేక్షణలో నిర్వహించబడినది. దీనిలో భాగంగా ప్రభుత్వ గురుకుల పాఠశాల భూపతి పాలెం ను డా. తిరన్, గోకవరం సంజీవయ్య నగర్ నందుగల సాంఘిక సంక్షేమ హాస్టల్ ను డా. నిఖిత సందర్శించి విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పిల్లలకు హిమోగ్లోబిన్, ఎత్తు, బరువులు, బాడీ మాస్ ఇండెక్స్ లు నమోదు చేసి పలు సూచనలు ఇచ్చారు.అనారోగ్య సమస్యలు వున్నవారికి చికిత్స అందించారు. హాస్టల్స్ నిర్వహణ, త్రాగు నీటి సరఫరా,వంట గది పరిశుభ్రత, డార్ మెట్రి మరియు మెనూ పరిశీలించి వార్డెన్స్ కు పలు సూచనలి చ్చారు.ఈ కార్యక్రమం లో వార్డెన్స్ భూపతి పాలెం నుండి ప్రిన్సిపాల్ జి. అశోక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. రాజా, హాస్టల్ నర్స్ గ్రేస్,సాంఘిక సంక్షేమ హాస్టల్ గోకవరం -4 నుండి వార్డెన్ జి.రామకృష్ణ పాల్గొన్నారు. వైద్య సిబ్బంది దినేష్, కుమారస్వామి, వినోలియా,మోనిక, పవన్,ఆచారి,విశ్వనాథం, వరలక్ష్మి, వెంకటలక్ష్మి ఆశాలు పాల్గొన్నారు.

## గాదరాడ గ్రామంలో ప్రజా సేవలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ






**రాజానగరంజులై 14 .అక్షర టైమ్స్ :** రాజానగరం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ , నేడు కోరుకొండ మండలంలోని గాదరాడ గ్రామంలో గ్రామ ప్రజలతో ముఖాముఖి సమావేశమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గాదరాడ గ్రామస్తులు తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, రహదారులు, మరియు తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడి, సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ఆయన ఆరా తీశారు. ఏ ఒక్క అర్హుడు పథకాలకు దూరంగా ఉండకూడదని, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనులు జరగాలని స్పష్టం చేశారు. గాదరాడ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికాబద్ధంగా నిధులను మంజూరు చేయిస్తామని, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పటాన్చెరులో జూలై 18న శ్రీ జగన్నాథ రథయాత్ర పాల్గొంటామని తెలిపిన మెట్టుకుమార్ యాదవ్



**పటాన్చెరు,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్** హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 18న శనివారం పటాన్చెరులో శ్రీ జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ నివాసానికి వెళ్లి, ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని నిర్వాహకులు కోరగా, మెట్టుకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో తాను తప్పకుండా పాల్గొంటానని తెలిపారు. రామాలయం నుండి ప్రారంభమై ఎంజీ రోడ్, మార్కెట్ రోడ్ల మీదుగా తిరిగి రామాలయం వరకు సాగే ఈ రథయాత్ర ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం. నరసింహులు, మురళీధర్, లక్ష్మణ్, కృష్ణ, సంజీవరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యకు

# పెద్దపీట వేస్తోంది గోగుల సరిత

**మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన గోగుల సరిత, తుంగతుర్తి రవి**






**మేడిపల్లి,జూలై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి హరి మోహన్ రెడ్డి** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీజి సీపీసీఆర్ ) సభ్యురాలు గోగుల సరిత, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మరియు పార్టీ నాయకులు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన గోగుల సరిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యత, పరిశుభ్రత, పాఠశాల వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన వారు పాఠశాలలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం,మహ్మద్ మజర్,ప్రణయ్,బర్రె నాగరాజు,సోమయ్య,కాటపాక కుమార్,సునిల్,జయందర్,పంగ రాజు,శరత్ గౌడ్, సాయిరాం గౌడ్,భరత్,మేడిపల్లి మండల ఎంఈఓ శ్రీనివాస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులుసత్య ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## టైలర్స్ కాలనీలో మంచినీటి

# పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి**






**అమీన్‌పూర్,జూలై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.వీరేష్** అమీన్‌పూర్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, రక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ డివిజన్‌లోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో 55 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు మాట్లాడుతూ, ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అమీన్‌పూర్ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాను బలోపేతం చేసేందుకు ఈ నూతన పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ పనులు పూర్తయితే టైలర్స్ కాలనీ నివాసితులు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ధ్యేయంగా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి అన్ని మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ కాలనీల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ సత్యాగ్రహ దీక్ష విజయవంతం

**ఆర్.కృష్ణయ్యకు బండారు దత్తాత్రేయ,బేరి రామచంద్ర యాదవ్ సంఘీభావం**

**వెంటనే రూ.8 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి: బీసీ నేతల డిమాండ్**





**హైదరాబాద్/శేరిలింగంపల్లి,జులై 14 .అక్షర టైమ్స్ : -ప్రతినిధి** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధనకై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్ష అత్యంత విజయవంతమైంది. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ, విద్యార్థుల హక్కుల కోసం చేపట్టిన ఈ దీక్షకు రాజకీయ, సామాజిక వర్గాల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. దీక్షకు మాజీ గవర్నర్ సంఘీభావం ఈ సత్యాగ్రహ దీక్షకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. కదిలివచ్చిన బీసీ కులాల ఐక్యవేదిక బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ఈ దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించి, ఆర్. కృష్ణయ్యతో పాటు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమును రద్దు చేయాలని ప్రభుత్వం చూస్తోందని, ఇలాంటి కుట్రలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంబంధించిన రూ. 8 వేల కోట్ల ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేసి, పాత విధానాన్నే కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ దీక్షకు మద్దతుగా పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీగా తరలివచ్చారు. హాజరైన ప్రముఖులు ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మేదరి మహేంద్ర సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు కొంటు ముకుందం, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, రాష్ట్ర బీసీ కులాల సంఘాల ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్ పాల్గొన్నారు. అలాగే శేరిలింగంపల్లి నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, బీసీ యువజన నాయకులు భేరి చంద్రశేఖర్ యాదవ్‌లతో పాటు బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువజనులు మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేశారు.

# మీ ఓటు మీ ఆయుధం 'ఎస్ఐఆర్'తో మీ హక్కును కాపాడుకోండి



**కొండాపూర్,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి లభించిన అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు. ఐదేళ్లపాటు మనల్ని, మన దేశాన్ని ఎవరు పాలించాలో నిర్ణయించే అద్భుతమైన అవకాశం ఇది. కానీ, దురదృష్టవశాత్తూ ప్రతి ఎన్నికల్లోనూ ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లడం వల్లో, లేదా ఓట్లు గల్లంతు కావడం వల్లో ఎంతోమంది తమ అమూల్యమైన ఓటు హక్కును కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలోనే, మన ఓటును సురక్షితంగా ఉంచుకోవడానికి ఓటర్ల సేవా అప్లికేషన్ (ఎస్.ఐ.ఆర్.) ప్రక్రియ ఎంతో కీలకమైనదిగా మారింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ చాంద్ పాషా ఈ విషయమై ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు ప్రత్యేక పిలుపునిచ్చాడు. ఈ అప్లికేషన్ ఎందుకు ముఖ్యం మీ ఓటు నమోదును పునఃపరిశీలించుకోవడానికి, ఓటర్ల జాబితాలో మీ పేరు సరిగ్గా ఉందో లేదో సరిచూసుకోవడానికి మరియు ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా మీ ఓటు హక్కు భద్రంగా ఉండడానికి ఈ దరఖాస్తు పడుతుంది. మార్పులు చేర్పులు: మీ చిరునామా మారినా లేదా వివరాల్లో తప్పులున్నా దీని ద్వారా సరిచేసుకోవచ్చు. ఓటు భద్రత: మీ ఓటు జాబితా నుండి తొలగించబడకుండా ముందస్తుగా రక్షణ కల్పిస్తుంది. సులభమైన ప్రక్రియ: ఈ అప్లికేషన్‌ను పూర్తి చేసి మీ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్ (బి.ఎల్.ఓ.) కు అందజేస్తే సరిపోతుంది. "నా ఒక్క ఓటుతో ఏమవుతుంది?" ఈ నిర్లక్ష్యం వద్దు! "నా ఒక్క ఓటుతో ఏమవుతుంది అనుకోకండి... ఒక్క ఓటు దేశ భవిష్యత్తునే మార్చగలదు!" షేక్ చాంద్ పాషా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. చాలామంది "లక్షల ఓట్లలో నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుందిలే" అని బద్ధకిస్తుంటారు. కానీ చరిత్ర తిరగేస్తే.. ఒక్క ఓటుతో ప్రభుత్వాలు పడిపోయిన సందర్భాలు, ఒక్క ఓటుతో అభ్యర్థులు విజయం సాధించిన ఘట్టాలు ఎన్నో ఉన్నాయి. మీరు వేసే ప్రతి ఓటూ మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను నిర్ణయిస్తుంది. బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి తోడ్పడుతుంది. దేశ పటిష్టమైన భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుంది. షేక్ చాంద్ పాషా పిలుపు: ర్యాచరణకు దిగుదాం! కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ చాంద్ పాషా స్వయంగా తన అప్లికేషన్‌ను పూర్తి చేస్తూ.. ప్రజలందరినీ చైతన్యపరుస్తున్నాడు. "నేను నా బాధ్యతను పూర్తి చేశాను... మరి మీరు చేశారా?" అంటూ అతను విసిరిన ఈ సవాల్ ప్రతి ఓటరునూ ఆలోచింపజేసేలా ఉంది.రాజకీయాలకు అతీతంగా, మన హక్కుల కోసం మనం మేల్కోవాల్సిన సమయం ఇది. కేవలం నాయకులను విమర్శిస్తూ కూర్చోవడం కంటే, ఓటరుగా మన ప్రాథమిక బాధ్యతను నెరవేర్చడమే నిజమైన భక్తి అని అతను పిలుపునిచ్చాడు. ప్రతి ఓటరు చేయాల్సింది ఇదే వెంటనే మీ ఓటు వివరాలను సరిచూసుకోండి. అప్లికేషన్ ఫారమ్‌ను పూర్తిగా నింపండి. మీ లోకల్ బూత్ లెవల్ ఆఫీసర్ (బి.ఎల్.ఓ.)ని కలిసి ఫారమ్‌ను సమర్పించండి. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులను కూడా దీనిపై ప్రోత్సహించండి. ఆలోచించండి.అడుగు ముందుకు వేయండి. రేపటి ఉజ్వల భవిష్యత్తు కోసం ఈరోజే మీ ఓటును భద్రపరుచుకోండి.

# అన్నదాన సేవతో ఆదర్శంగా జమ్మిగడ్డ ఆర్య వైశ్య సంఘం

**ప్రతి అమావాస్య అన్నప్రసాద కార్యక్రమం..**

**సేవాభావంతో ముందుంటున్న కేశెట్టి ప్రసాద్**





**కాప్రా,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధిగోపగాని పాండు** జమ్మిగడ్డ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమం సేవా భావానికి, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా కొనసాగుతోంది. వాసవి మాత, అన్నపూర్ణ దేవి ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. సంఘ సభ్యుల సమిష్టి కృషి, సేవా తపనతో ఈ కార్యక్రమం నిరంతరం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సేవా కార్యక్రమానికి డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ అందిస్తున్న సహకారం ప్రత్యేకంగా నిలుస్తోందని సంఘ సభ్యులు పేర్కొన్నారు. ప్రజా కార్యక్రమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి అమావాస్య రోజున కార్యక్రమానికి స్వయంగా హాజరై వాసవి మాత, అన్నపూర్ణ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సభ్యులతో కలిసి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తూ సేవా స్ఫూర్తిని చాటుతున్నారని తెలిపారు.అన్నదానం కేవలం ఆకలి తీర్చే కార్యక్రమం మాత్రమే కాకుండా సమాజంలో ప్రేమ, మానవత్వం, సమానత్వాన్ని పెంపొందించే మహోన్నత సేవ అని వక్తలు పేర్కొన్నారు. ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా ఆహ్వానించి అన్నప్రసాదాన్ని అందించడం సంఘం సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు.పదవులు, ప్రచారాలకు అతీతంగా సేవనే లక్ష్యంగా ప్రజలకు అండగా నిలుస్తున్న కేశెట్టి ప్రసాద్ సేవా తత్పరత అభినందనీయమని సంఘ సభ్యులు కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రజల సహకారం మరింత పెరిగితే సమాజంలో మానవీయ విలువలు బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. చివరగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సంఘ సభ్యులు, దాతలు, సేవా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెల ఇదే స్ఫూర్తితో అన్నప్రసాద కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు.

# రంపయర్రంపాలెంలో 720 మంది మహిళలకు పట్టు చీరలు కానుక

**కంబాల శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ**

**గోకవరం,జులై 14 .అక్షర టైమ్స్ :** గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామంలో కంబాల కానుక వనితలకు వేడుక పట్టు చీరలు పంపిణీ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వహిందూ







ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం ఆధ్వర్యంలో గ్రామ యువత, నాయకులు, కార్యకర్తలు కలిసి బైక్ ర్యాలీగా ప్రాంగణం వరకు తీసుకువెళ్లారు. అనంతరం గ్రామస్తులు, ఆలయాల కమిటీ సభ్యులు, అభిమానులు పూలవర్ష కురిపిస్తూ మహిళలు హారతులు పడుతూ ఘన స్వాగతం పలికి, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గ్రామంలోని పలు ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు తొలితగా పట్టు చీరలను సమర్పించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా 720 మంది మహిళలకు పట్టు చీరలను కంబాల శ్రీనివాసరావు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలని, వారి సంక్షేమం, గౌరవం కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. మహిళా భక్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావడం కోసం గత మూడేళ్ల నుంచి ఆషాఢ, శ్రావణ మాసాల్లో మహిళలకు పట్టు చీరలు, బంగారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సేవే తన లక్ష్యమని, సమాజంలోని ప్రతి వర్గానికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎస్‌బీసీ కార్యాలయంలో పోలీసు అధికారితో ఆత్మీయ సమ్మేళనం

**శేర్లింగంపల్లి,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** సైబరాబాద్ పోలీసు విభాగం మరియు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హెచ్‌ఎస్‌బీసీ ప్రాంగణంలో పోలీసు అధికారితో ఆత్మీయ సమ్మేళనం ఐదో విడత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. "డిజిటల్ సవాలును కలిసి ఎదుర్కొందాం" అనే ఇతివృత్తంతో జరిగిన ఈ సమావేశంలో 130 మందికి పైగా యువ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాల భద్రత మరియు






బాధ్యతాయుతమైన సాంకేతిక ప్రవర్తనపై ఈ సందర్భంగా లోతైన చర్చలు జరిగాయి. ?ఈ వినూత్న కార్యక్రమానికి సైబరాబాద్ అంతర్జాల నేరాల విభాగపు ఉప పోలీస్ కమిషనర్ కె.పుష్ప ముఖ్య అతిథిగా హాజరుకాగా, అదే విభాగపు నిరీక్షకులు దుర్గాప్రసాద్ కూడా పాల్గొన్నారు. 'సంభాషణ, అనుసంధానం మరియు సహకారం' అనే ప్రాథమిక సూత్రాల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం.. ఉద్యోగులు నేరుగా పోలీసు అధికారులతో మాట్లాడటానికి, తమ అభిప్రాయాలను పంచుకోవడానికి మరియు ఆచరణాత్మక అవగాహనను పెంపొందించుకోవడానికి ఒక చక్కని వేదికగా నిలిచింది.

**ఉద్యోగులతో ఆత్మీయ సంభాషణ:**

కార్యక్రమం ప్రారంభంలో ఉద్యోగులను ఉత్తేజపరిచేందుకు ఒక ప్రత్యేక ప్రక్రియను నిర్వహించారు. "ప్రస్తుత తరుణంలో మీకు ఇంకా ఏమి కావాలని కోరుకుంటున్నారు?" అని ప్రశ్నించగా.. సమయం, ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, మద్దతు, తగినంత నిద్ర మరియు జీవితంలో సమతుల్యత కావాలని ఉద్యోగులు బదులిచ్చారు. నేటి తరం యువ ఉద్యోగులు ఎదుర్కొంటున్న రోజువారీ సవాళ్లను ప్రతిబింబిస్తూ సాగిన ఈ సంభాషణ, అంతర్జాల భద్రత మరియు మానసిక శ్రేయస్సుపై చర్చకు దారితీసింది. సంస్థ వ్యూహాత్మక కార్యకలాపాల సంచాలకులు రష్మీ శ్రీవాస్తవ హాజరైన వారందరికీ స్వాగతం పలికారు. పరిశ్రమలు మరియు పోలీసు విభాగం మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే తమ కౌన్సిల్ లక్ష్యమని, ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా ఉద్యోగులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్ది, సురక్షితమైన సమాజ స్థాపనలో భాగస్వాములను చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

**నిత్యజీవిత సమస్యలపై చర్చ**

ఈ సమావేశంలో కేవలం అంతర్జాల భద్రత గురించే కాకుండా, నగరంలో పెరుగుతున్న రవాణా ఇబ్బందులు, మితిమీరిన హారన్ల శబ్దాలు వంటి రోజువారీ పౌర సమస్యలపై కూడా ఉద్యోగులు స్వేచ్ఛగా చర్చించారు. అదే సమయంలో అంతర్జాల నేరాలను అరికట్టడంలో మరియు బాధితులకు తక్షణ సహాయం అందించడంలో పోలీసులు చూపుతున్న చొరవను, నిబద్ధతను ఉద్యోగులు ఎంతగానో అభినందించారు. పోలీస్ అధికారిణిలోని ఆత్మీయ కోణం,ఉప పోలీస్ కమిషనర్ కె.పుష్ప తన సహజసిద్ధమైన వినమ్రతతో, ఆత్మీయతతో ఉద్యోగులందరినీ ఆకట్టుకున్నారు. ఆమె కేవలం ఒక ఉన్నతాధికారిణిగా మాత్రమే కాకుండా.. ఒక తల్లిగా, గృహిణిగా, కుటుంబ సభ్యురాలిగా తన వ్యక్తిగత జీవిత అనుభవాలను పంచుకోవడంతో ఉద్యోగులు ఆమెతో సులువుగా మమేకమవగలిగారు. ఆమె నిత్యజీవిత ఉదాహరణలతో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, సమాచార చౌర్యం, వ్యక్తిగత సమాచార గోప్యత, సామాజిక మాధ్యమాల ప్రమాదాలు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం మరియు అంతర్జాల నేరాలపై ఫిర్యాదు చేసే విధానాల గురించి విపులంగా వివరించారు. అనుమానాస్పద లింక్‌లపై నొక్కేటప్పుడు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు లేదా ధన లావాదేవీలు జరిపేటప్పుడు ఒక క్షణం ఆగి, సరిచూసుకోవడం ద్వారా మోసాల బారిన పడకుండా ఉండవచ్చని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగులతో ఒక ముఖ్యమైన ప్రమాణం చేయించారు.

**"ఆగండి.. సరిచూసుకోండి.. సురక్షితంగా ఉండండి"**

ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్‌బీసీ మేనేజింగ్ డైరెక్టర్ మరియు మహిళా భద్రతా విభాగపు సంయుక్త కార్యదర్శి శ్రీమతి మమతా మదిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. సురక్షితమైన మరియు సాంకేతిక అవగాహన కలిగిన పని వాతావరణాన్ని నిర్మించడంలో పోలీసు విభాగం మరియు తమ సంస్థల ఉమ్మడి నిబద్ధతను ఆమె పునరుద్ఘాటించారు. చివరగా ఉద్యోగుల ప్రశ్నలకు అధికారులు ఓపిగ్గా సమాధానాలిచ్చారు. పరస్పర నమ్మకం, నిరంతర సంభాషణ మరియు ఉమ్మడి బాధ్యత ద్వారా మాత్రమే సురక్షితమైన అంతర్జాల సమాజాన్ని నిర్మించగలమనే సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# మాదాపూర్ వార్డులో 'వన్ వార్డ్ ఎవ్రీ డే'.. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించిన సీఎంసీ కమిషనర్

**మాదాపూర్,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ధ్యేయంగా "వన్ వార్డ్ ఎవ్రీ డే" కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా కూకట్‌పల్లి జోన్, మాదాపూర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్ వార్డులో మున్సిపల్ కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో స్థానిక గౌరవ ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మరియు పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్థానికులతో ముఖాముఖి.. సమస్యల వెల్లువ మాదాపూర్ లోని సిలికాన్ వ్యాలీ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమంలో కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, స్థానిక ప్రజలతో కమిషనర్ నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు తమ పరిధిలోని పలు మౌలిక వసతుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ప్రస్తావించిన ప్రధాన సమస్యలు మౌలిక వసతులు: బోర్‌వెల్ మరమ్మతులు, భూగర్భ మురుగునీటి (యూజీడీ) నెట్‌వర్క్ ఆధునీకరణ, తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా, ట్యాంకర్ సేవల్లో ఇబ్బందులు. రహదారులు ఆక్రమణలు: రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనుల వల్ల పేరుకుపోయిన శిథిలాల తొలగింపు, రహదారుల ఆక్రమణలు, అక్రమ పార్కింగ్ నివారణ. పార్కుల అభివృద్ధి: పార్కులలో ఓపెన్



జిమ్‌ల ఏర్పాటు, చిన్నారుల ఆట పరికరాల అమరిక. భద్రత ఽ పారిశుధ్యం: ట్రాఫిక్ సమస్యల నియంత్రణ, పార్కుల పరిసరాల్లో పోలీసు పెట్రోలింగ్ పెంపు, చెట్ల కొమ్మల కత్తిరింపు వల్ల వచ్చే వ్యర్థాలను సకాలంలో తొలగించడం. ఇతర అంశాలు: సీఎన్ తండా శ్మశానవాటిక సమస్యలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై చర్యలు, స్థానిక హాస్టళ్లలో నీటి వృధా, వ్యర్థాల నిర్వహణపై నిఘా. అధికారులకు కమిషనర్ కఠిన ఆదేశాలు ప్రజలు నివేదించిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్, ప్రాధాన్యత క్రమంలో తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను




ఆదేశించారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని, ఎక్కడా కాలయాపన జరగకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు."'వన్ వార్డ్ ఎవ్రీ డే' కార్యక్రమం ముఖ్య ఉద్దేశం క్షేత్రస్థాయిలో పౌర సమస్యలను నేరుగా తెలుసుకోవడమే. ప్రజలతో మున్సిపల్ యంత్రాంగానికి ఉన్న బంధాన్ని బలోపేతం చేస్తూ.. స్థానిక అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పనులను వేగవంతం చేస్తాం అన్నారు.

# పటేల్ చెరువును సుందరవనంగా తీర్చిదిద్దుతాం పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**డ్రోన్ సహాయంతో గుర్రపుడెక్క తొలగింపు,**
**కలుపు మందు పిచికారీ**
**చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ ఏర్పాటు**
**కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి**
**పనులను పరిశీలించిన గాంధీ**

**శేరిలింగంపల్లి,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువును పూర్తి స్థాయిలో రక్షించి, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే సుందరవనంగా, శోభితవర్ణంగా తీర్చిదిద్దుతామని బడ్జెట్ అంచనాల కమిటీ (పిఎసి) చైర్మన్ ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం పటేల్ చెరువులో గుర్రపుడెక్క తొలగింపు, దోమల నియంత్రణ పనులను స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క నిర్మూలన కోసం డ్రోన్ సహాయంతో, మానవాళికి ఎలాంటి హాని కలిగించని కలుపు



మందును పిచికారీ చేయించే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

ఆధునిక సాంకేతికతతో దోమల నియంత్రణ ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ... చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, అపరిశుభ్రత వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి స్థానిక కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అనారోగ్యాల బారిన పడ్డారని గుర్తుచేశారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, శాశ్వత పరిష్కారం కోసం ఈ ఆధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో గుర్రపుడెక్కను తొలగించి, దోమలను అదుపు చేస్తామన్నారు.

**కబ్జాల నిరోధం.. వాకర్స్ కోసం ప్రత్యేక ట్రాక్**

చెరువులు కలుషితం కాకుండా, కబ్జాలకు గురికాకుండా పూర్తి స్థాయిలో సంరక్షిస్తామని గాంధీ హామీ ఇచ్చారు. అందులో భాగంగానే పటేల్ చెరువు చుట్టూ రక్షణ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, స్థానికులు, మార్నింగ్ వాకర్స్ కోసం చక్కటి వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తామన్నారు. చెరువు నీరు కలుషితం కాకుండా ఉండేందుకు సహజసిద్ధమైన పద్ధతిలో తామర పువ్వుల మొక్కలను పెంచి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పారు. కేవలం పటేల్ చెరువు మాత్రమే కాకుండా, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మార్నింగ్ వాకర్స్, మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# చిలుకా నగర్ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు

**రూ.35 లక్షలతో బొడ్రాయి ప్రాంతంలో రూ.48**
**లక్షలతో న్యూ రాంనగర్ లో సీసీ రోడ్ల మరామ్మతులు**
**రూ.30 లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం**
**కాలనీల వాసులకు నిధుల మంజూరు పత్రాలను**
**అందచేసిన పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి హరి మోహన్ రెడ్డి** ఉప్పల్ పరిధిలోని చిలుకానగర్ కు మరో సారి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి భారీగా నిధులను మంజూరు చేయించారు. చిలుకానగర్ లో చాలా కాలంగా పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు పరమేశ్వర్ రెడ్డి కృషి ఫలితంగా మంజూరు అయ్యాయి. నిధుల మంజూరు పత్రాలను పరమేశ్వర్ రెడ్డి చిలుకానగర్ డివిజన్ లోని వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాలను అందచేశారు. అభివృద్ధి పనులకు ఎన్ని నిధులైనా తెస్తా: పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం లోని కాలనీలు, మురికివాడల అభివృద్ధికి కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తూ



పనులను చేపడుతున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మన కాలనీలు, మురికివాడల అభివృద్ధికి, సంక్షేమానికి ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. చిలుకానగర్ లో రూ.35 లక్షలతో బొడ్రాయి ప్రాంతంలో సీసీ రోడ్ల మరామ్మతు పనులను చేపట్టనున్నట్టుగా తెలిపారు. ఇదే కాకుండా మరో రూ.48 లక్షలతో న్యూ రాంనగర్



లోనూ సీసీ రోడ్ల మరామ్మతు పనులను చేపట్టనున్నట్టుగా చెప్పారు. చిలుకా నగర్ లోని కృష్ణవేణి రూ.30 లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణంతో ఇక్కడ నెలకొని ఉన్న సమస్య పరిష్కారం కానున్నట్టుగా తెలిపారు. కార్యక్రమంలో చిలకనగర్ డివిజన్ అధ్యక్షులు మహేష్ ముదిరాజ్ ,ఆగం రెడ్డి ,రాజేష్ ముదిరాజ్ ,అమరేశ్వరి ,సంగీత ,లక్ష్మి , చైతన్య ,రేఖ, శారద,జమున. వనమాల. జయ. భారతి. ఏ సంతోష్. రాజు. పుణ్య. సంతోష్. విశాల్, జింక లక్ష్మీనారాయణ బురుగుల కృష్ణ గౌడ్ బూర్గుల రాజేష్ గౌడ్ సకినాల జైన్ ఆసిఫ్ అన్సారి తదితరులు పాల్గొన్నారు

# జనసేన నాయకులారా అర్థం లేని వ్యర్థమైన మాటలు ఆపండి

**జెడ శ్రావణ్ కుమార్ ఎవరో తెలియకపోతే తెలుసుకోండి**
**జెబిపి జిల్లా అధ్యక్షులు డా. మైనం పాటి యేసురత్నం**

**కావలి,జులై 14 .అక్షర టైమ్స్ :** జన సైనికులారా.. అర్థం లేని వ్యర్ధమైన మాటలు ఆపండి. జై భీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక



అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ ఎవరో తెలియదా.., తెలియకపోతే అర్థం అయ్యే విధంగా ముందు తెలుసుకొనీ ఆ తరువాత ఆయన గురించి మాట్లాడండి అని నెల్లూరు జిల్లా జెబిపి పార్టీ జిల్లా అధ్యక్షులు, కావలి నియోజకవర్గం ఇంచార్జ్ డా. మైనం పాటి యేసురత్నం విలేఖరుల సమావేశంలో పేర్కొన్నారు. మంగళవారం కావలి పట్టణము జై భీమ్ రావ్ భారత్ పార్టీ కార్యాలయంలో పత్రికా



సమావేశం నిర్వహించబడినది. ఈ సమావేశము కావలిలోనీ జనసేన పార్టీ నాయకులు సుధాకర్ ఆధ్వర్యంలో మరియు తిరుపతి జనసేన పార్టీ ఇన్చార్జి కిరణ్ రాయ్ అనే వారు ఇటీవల తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ పై చేసిన ఆరోపణలను ఖండిస్తూ ఈ సమావేశం ఏర్పాటు చేయడమైనది. ముందుగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కుదుటపడలని, ప్రజలకు వారు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి అని, ప్రజలకు అందుబాటులోకి త్వరగా రావాలని దేవుని ప్రార్థిస్తున్నాను అన్నారు. జై భీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ న్యాయమూర్తి, ప్రస్తుత హైకోర్టు సుప్రీంకోర్టు న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ గురించి మన తెలుగు రాష్ట్రాల ప్రజలు, పాలకులు, అధికారులకు తెలియడమే కాకుండా, దేశవ్యాప్తంగా కూడా ఆయన తెలియని వారంటూ లేరు అన్నారు. జనసేన నాయకులకు తెలియాల్సిన విషయం ఏంటంటే, పవన్ కళ్యాణ్ ని విమర్శిస్తే, జడ శ్రావణ్ కుమార్ ఫేమస్ అవుతాడని, మీరు అనడం హాస్యాస్పదంగా ఉన్నది అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. అన్యాయాన్ని సింహం లాగా ధైర్యముగా ఎదిరించే ధైర్యశాలి, పేదలకు, దళితులకు, మైనారిటీలకు అండగా ఉండి న్యాయస్థానంలోనూ, ప్రజాస్వామ్యంలోనూ ప్రజల పక్షాన ఏ స్వలాభం అపేక్షించకుండా నిత్యము పోరాడే పోరాట యోధుడు జడ శ్రావణ్ కుమార్ అని కొనియాడారు. మీ నాయకులు ఫవన్ కళ్యాణ్ లాగ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కులాన్ని, పార్టీని, నాయకులను అడ్డం పెట్టుకునీ రాజకీయాలు చేసే అంతటి నాయకుడు మా జడ శ్రావణ్ కుమార్ కాదు అని ఘాటుగా స్పష్టం చేశారు. ఎలక్షన్లకు ముందు ఒక రకంగానూ, ఎలక్షన్ అయిపోయిన తర్వాత మరొక రకంగానూ ప్రవర్తించి రంగులు మార్చే నాయకుడు మా జడ శ్రావణ్ కుమార్ కాదు అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం కులాన్ని మతాల రంగులను పూసుకొని ప్రజల్లోకి వస్తున్న నాయకులు ఎవరో ప్రజలకు బాగా తెలుసు. న్యాయం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కొరకు పోరాడే జడ శ్రావణ్ కుమార్ మీ నాయకుడ్ని విమర్శించి ఫేమస్ అవ్వాల్సిన దౌర్భాగ్యం, అవసరం అంతకంటే లేదు అన్నారు. శ్రావణ్ కుమార్ ని విమర్శించాలంటే ముందు మీ నాయకుడు మీకేమి చెప్పి మాట్లాడిస్తున్నాడో, ఆయన ఏం చేస్తున్నాడో ముందు తెలుసుకోండి. సినిమాలు తీస్తే రోజుకి నాకు రెండు కోట్లు వస్తుందని చెప్పింది పవన్ కళ్యాణ్ , ఇప్పుడు ఇన్కమ్ టాక్స్ వారికి శ్రావణ కుమార్ కంప్లైంట్ చేస్తానంటే దడుసుకొని మీ లాంటి వారి చేత విమర్శించే స్థాయికి దిగజారిపోయిన పవన్ కళ్యాణ్ అని మాకు అర్థమవుతుంది అన్నారు. ఆ విషయం మీకు అర్థమవుతుందా.., ఆయన స్వార్థానికి మిమ్మల్ని వాడుకుంటున్నాడని, ప్రజలకు సేవ చేయడానికి పార్టీని పెట్టి నట్లు చూపుతూ, వారి స్వార్ధ ప్రయోజనాల కోసం ఈరోజు ఆయన ప్రవర్తిస్తున్న తీరు మీ పార్టీలో ఎంతోమంది గ్రహించి రగిలిపోతున్నారో తెలుసుకోండి. ఇక రెండు సంవత్సరాలు ఆగండి అందరు బయటపడతారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ పుణ్యమా అని మీకు అధికారంలో వాటా వచ్చింది కాబట్టి కొంతమంది బయటపడటంలేదు. త్వరలోనే మీ పార్టీ వాళ్లే పవన్ కళ్యాణ్ గురించి చెప్పే రోజు వస్తది "వాపు చూసి బలం అనుకోకండి" ఈ లోపల కొంచెం మీరు న్యాయంగా మాట్లాడితే బాగుంటుంది. శ్రావణ్ కుమార్ లాయర్ కాకపోతే రావణ్ మీద మీరు నాలుగు చోట్ల కేసులు పెడితే బెయిల్ రావడానికి మాట్లాడింది ఏ లాయర్? ప్రజలు చూస్తున్నారు వింటున్నారు అన్నిటిని ఆలోచిస్తున్నారు అది గ్రహించి మీరు మాట్లాడడం చాలా మంచిది. మీరు ఇలాగే మూర్ఖంగా మాట్లాడితే ప్రజలే రాబోయే ఎలక్షన్ లలో మీకు, మీ పార్టీ నాయకుడికి బుద్ధి చెబుతారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, దళిత నాయకులు, జెబిపి నాయకులు పాల్గొన్నారు

### ప్రజలు దేవుళ్లు కాలనీలు దేవాలయాలు అభివృద్ధి

# పథంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**శేర్లింగంపల్లి,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** ప్రజలే దేవుళ్లని, వారు నివసించే కాలనీలే దేవాలయాలని భావించి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వెల్లడించారు. నియోజకవర్గంలోని పలు డివిజన్ల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను ఏమాత్రం పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు చూపుతామని గాంధీ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, సత్వరమే సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. రాబోయే కార్పొరేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజల్లోకి బలంగా వెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఓటరు జాబితా సవరణలో

# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**చర్లపల్లి,జులై 14 .అక్షర టైమ్స్ : ప్రతినిధి గోపగాని పాండు** ఓటరు జాబితా ప్రత్యేక పునఃపరిశీలన కార్యక్రమాన్ని ప్రతి ఓటరు బాధ్యతగా భావించి, నింపిన పునఃపరిశీలన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ




సీనియర్ రాష్ట్ర నాయకుడు రుద్రగోని రాంచందర్ పిలుపునిచ్చారు.మంగళవారం ఆయన స్వయంగా నింపిన పునఃపరిశీలన దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులు రాజు, శ్రీలతలకు అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, వ్యక్తిగత వివరాలు సక్రమంగా నమోదైతేనే ప్రతి పౌరుడు తన ఓటు హక్కును ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకోగలడని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు ఉంటే వెంటనే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ఆ హక్కును పరిరక్షించుకోవాలంటే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తులను సమర్పించి ఎన్నికల సంఘానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడియాల అనిల్, చికెన్ శ్రీనివాస్, కిరణ్, మోహన్, శివతేజ తదితరులు పాల్గొని ఓటరు జాబితా పునఃపరిశీలన కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని వారు పిలుపునిచ్చారు.

# 'షీ 'చిత్ర షూటింగ్ పూర్తి..

**గిద్దలూరు,జులై 14 .అక్షర టైమ్స్ :** షీ చిత్ర నిర్మాణం విజయవంతంగా పూర్తయిందని నిర్మాత దీపిశెట్టి తెలిపారు.గిద్దలూరు ప్రాంతానికి చెందిన బృందం నటించి నిర్మిస్తున్న ఈ చిత్రం సామాజిక అంశాలతో కూడిన కథాంశంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.సాంకేతిక నిపుణులు నటీనటుల సమిష్టి కృషితో ఈ సినిమా చిత్రీకరణ ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈ సినిమా పూర్తయిందని నిర్మాత తెలిపారు.ఈ చిత్రానికి కొమ్మునూరి సురేష్ దర్శకత్వం వహించగా కొంగులూరి నందిని డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ గా పని చేశారు.. ఈ చిత్రంలో ప్రసాదరావు వెంకటేశ్వర్లు, కోటయ్య సునీత ప్రమీల తదితరులు ప్రధాన పాత్రలో నటించారు.



## టీడీపీ వైపు ప్రజల ఆదరణ పెరుగుతోంది అంబవరపు శ్రీనివాసరెడ్డి



**రాచెర్ల,జులై 14 .అక్షర టైమ్స్ :** రాచర్ల మండలం అనుమలవీడు గ్రామంలో వైఎస్సార్సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముందుకు రావడం రాష్ట్రంలో వున్న రాజకీయ పరిస్థితులకు నిదర్శనమని టీడీపీ ఒంగోలు పార్లమెంటరీ పార్టీ కోశాధికారి అంబవరపు శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలు , అలాగే గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుండటంతో ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. అనుమలవీడు గ్రామంలో వైఎస్సార్సీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించి వారికి రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అంబవరపు శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధే లక్ష్యంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వెంట నడుస్తామని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరింత మంది ప్రజలు, యువత, మహిళలు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# కంభం లో ఆటో బోల్తా ఇద్దరికీ తీవ్ర గాయాలు

**కంభం,జులై 14 .అక్షర టైమ్స్ :** మార్కాపురం జిల్లా కంభం పట్టణంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది స్థానిక వై జంక్షన్ సమీపంలో ప్రయాణికులతో వెళుతున్న ఒక ఆటో అదుగుతప్పి ఒక్కసారిగా రోడ్డుపై బోల్తా పడింది ఈ ప్రమాద సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు గాయపడిన వారిని రక్షించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో గాయపడిన క్షేత్రగాత్రులు ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహా ధర్నా

**జూలై 18న 'చలో రామాయపట్నం'**
**మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పిలుపు**

**కావలి,జులై 14 .అక్షర టైమ్స్ :** కూటమి ప్రభుత్వం రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరిస్తోందని ఆరోపిస్తూ, దానికి వ్యతిరేకంగా జూలై 18న నిర్వహించనున్న 'చలో రామాయపట్నం' మహాధర్నాలో ప్రజలు,




రైతులు, మత్స్యకారులు, కార్మికులు, యువత, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రూ.4,000 కోట్ల వ్యయంతో నిర్మించిన రామాయపట్నం పోర్టును కేవలం రూ.1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేయడం దారుణమని విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు విరుద్ధమని ఆయన ఆరోపించారు. పోర్టును ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు పరిరక్షణ కోసం చేపట్టిన ఈ ఉద్యమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు.

# షాబాద్ హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహాన్ని తిరస్కరించిన కుటుంబం

**షాబాద్ ఆరుగురి హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య**

**కొత్తూరు మండలం పంజర్ల వద్ద ఓ వెంచర్‌లో లభ్యమైన మృతదేహం**

**మృతదేహాన్ని స్వీకరించేందుకు నిరాకరించిన కుటుంబసభ్యులు**

**బాధితుల కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయం**



రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురిని అతి దారుణంగా హత్య చేసిన ఉదంతంలో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం కొత్తూరు మండలం పంజర్ల గ్రామం సమీపంలోని ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌లో అతని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఘటనా స్థలంలో విషం సీసా లభించడంతో, అతను ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, నిందితుడి మృతదేహాన్ని స్వీకరించేందుకు అతని కుటుంబ సభ్యులు నిరాకరించడంతో, స్థానిక మున్సిపల్ అధికారులే అంత్యక్రియలు నిర్వహించారు.రాజ్‌కుమార్ మృతదేహానికి సోమవారం రాత్రి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తొలుత ఈ ప్రక్రియను చేపట్టేందుకు విధుల్లో ఉన్న వైద్యులు విముఖత చూపడంతో పోలీసులు సుమారు మూడు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లా ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులను పిలిపించేందుకు ప్రయత్నాలు జరిగాయి. చివరకు చేవెళ్ల ఆసుపత్రి వైద్యులు లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రణీత్ లు వచ్చి పోస్టుమార్టం ప్రక్రియను పూర్తి చేశారు.జూలై 11న షాబాద్ మండలం దైవలగూడ గ్రామంలో రాజ్‌కుమార్ ఈ ఘాతుకానికి పాల్పడిన సంగతి తెలిసిందే. తాను వేధిస్తున్న 16 ఏళ్ల బాలిక, ఆమె తల్లి, నాయనమ్మతో పాటు తన భార్య సరిత, ఇద్దరు కుమారులను అతను అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. సదరు బాలికపై వేధింపులకు సంబంధించి అతనిపై ఇప్పటికే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఆ కేసులో ముందస్తు బెయిల్ పొందిన తర్వాతే రాజ్‌కుమార్ ఈ సామూహిక హత్యలకు ఒడిగట్టాడు.ఈ ఘటన అనంతరం పరారీలో ఉన్న నిందితుడి కోసం తెలంగాణ పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టారు. రాజ్‌కుమార్ మరణవార్త విన్న బాధితుల కుటుంబ సభ్యులు ఒకవైపు విషాదంలో ఉన్నప్పటికీ, మరోవైపు ఊరట చెందారు. జిల్లా కలెక్టర్ సహా స్థానిక నాయకులు బాధితుల కుటుంబాలను పరామర్శించి, కుటుంబంలోని దివ్యాంగురాలైన బాలికకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, బాధితులకు ఇల్లు, మెరుగైన పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు.

# రాజకీయంగా నాపై బురద జల్లడానికే అసత్య ఆరోపణలు: పైలా సుభాష్ చంద్రబోస్

**"తప్పు చేయలేదు.. భయపడను..న్యాయ పోరాటం చేస్తా"**

**జగనన్న కాలనీలో పన్నుల పేరుతో అక్రమ వసూళ్లు బయటపెడతాననే తప్పుడు కేసులు**

**ఏలేశ్వరంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలను ఇకపై ఎండగడతా**

**బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పైలా సుభాష్ చంద్రబోస్**




**ఏలేశ్వరం,జూలై14.అక్షర టైమ్స్:-** తనపై రాజకీయ బురద జల్లడానికే తప్పుడు ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని,సోమవారం కాకినాడలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అసత్య ప్రచారాలు చేసారని ఏలేశ్వరం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు పైలా సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు.మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో పన్నుల పేరుతో కొంతమంది నాయకులు చేస్తున్న అక్రమ వసూళ్ల వ్యవహారం బయటపడుతుందనే ఉద్దేశంతోనే తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు.తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని,సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని,న్యాయం జరుగుతుందని తెలిపారు.తాను ఎలాంటి తప్పు చేయలేదని,ఎవరికి భయపడేది లేదని స్పష్టం చేశారు.ఏలేరు కాలువలో అప్పన్నపాలెం బ్రిడ్జి వద్ద జెసిబిలతో ఇసుక తీసిన గోతులలో ఒకరు ప్రాణం కోల్పోతే పట్టించుకున్నవారే లేరని దుయ్యబట్టారు.కొంతమంది రాజకీయ లబ్ధి కోసమే పార్టీలు మారుతూ నీతులు చెబుతున్నారని ఆరోపించారు.తనపై వచ్చిన ఆరోపణలపై న్యాయ పోరాటం చేస్తానని పేర్కొన్నారు.ఇకపై ఏలేశ్వరం మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి,అక్రమాలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకొస్తానని పైలా సుభాష్ చంద్రబోస్ అన్నారు.

# ఏసీబీ వలలో అవినీతి తిమింగలం
# పెద్దపల్లి మున్సిపల్ ఏఈ ఇంట్లో నోట్ల కట్టలు!

**పెద్దపల్లి మున్సిపల్ ఏఈ కల్లేపల్లి సతీశ్ కుమార్ అరెస్ట్**

**రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత**

**కాంట్రాక్ట్ బిల్లు మంజూరు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ**

**అధికారి ఇంట్లో రూ.32 లక్షలకు పైగా లెక్కల్లో చూపని నగదు స్వాధీనం**

**నిందితుడిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్న అధికారులు**



పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన దాడిలో ఓ అవినీతి అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ) పనిచేస్తున్న కల్లేపల్లి సతీశ్ కుమార్, ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడ, కునారం రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.12.28 లక్షల తుది బిల్లును ప్రాసెస్ చేసి, మంజూరు కోసం పంపడానికి సతీశ్ కుమార్ ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు, కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు పక్కా ప్రణాళికతో సతీశ్ కుమార్ నివాసంలో అతడు లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నారు. లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్న అనంతరం, ఏసీబీ అధికారులు సతీశ్ కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లెక్కల్లో చూపని రూ.32,31,900 నగదు లభించడంతో అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు. లంచం సొమ్ముతో పాటు ఈ నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు సతీశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్ ఫ్రీ నంబర్ 1064 ద్వారా తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలను కోరింది.

# వియత్నాం బోటు ప్రమాదం.. హైదరాబాద్ చేరిన ఏపీ వాసుల మృతదేహాలు

**మృతదేహాలను స్వీకరించి కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**స్వగ్రామాలకు తరలించేందుకు ప్రత్యేక అంబులెన్సులు ఏర్పాటు చేసిన ఏపీ ప్రభుత్వం**

**మొబైల్ ఫోన్ కంపెనీ ఏర్పాటు చేసిన టూర్‌లో చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదం**

**ఈ ప్రమాదంలో మరణించిన మొత్తం 15 మంది భారతీయులు**



వియత్నాంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన ఏపీకి చెందిన ముగ్గురు పర్యాటకుల మృతదేహాలు ఇవాళ హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాయి. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విమానాశ్రయానికి వెళ్లి మృతదేహాలను స్వీకరించి, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కడపకు చెందిన ముదియం శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన గెల్లి జయలక్ష్మి, హిందూపురానికి చెందిన రవితేజ పార్థివదేహాలను మొదట వియత్నాం నుంచి ముంబైకి తీసుకొచ్చారు. సోమవారం రాత్రి 9:35 గంటలకు ముంబై ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాక, అక్కడ అవసరమైన అన్ని చట్టపరమైన ప్రక్రియలను వేగంగా పూర్తి చేశారు. అనంతరం మంగళవారం ఉదయం ఇండిగో విమానంలో మృతదేహాలను హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కార్గో టెర్మినల్‌కు తరలించారు.మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బాధిత కుటుంబాలతో మాట్లాడి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్థివదేహాలను వారి స్వగ్రామాలకు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్సుల ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఏపీ భవన్ అధికారులు సమన్వయంతో మృతదేహాలను స్వదేశానికి తరలించే ఏర్పాట్లు చేశారు. వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో శనివారం (జులై 11) ఈ దుర్ఘటన జరిగింది. ఓ ప్రముఖ మొబైల్ ఫోన్ కంపెనీ తమ డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన విహార యాత్రలో ఈ విషాదం చోటుచేసుకుంది. వీరు ప్రయాణిస్తున్న పడవలో మొత్తం 32 మంది ఉండగా, ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మృతురాలు జయలక్ష్మి భర్త గెల్లి కిషోర్ ఈ ప్రమాదంలో గాయపడి, వియత్నాంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. యాత్రకు వెళ్లిన మిగతా తెలుగు పర్యాటకులు ఆదివారం రాత్రికే సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకున్నారు.

# ఆదాయానికి మించి ఆస్తులు

**హెచ్‌ఎండీఏ సీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు**

**హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్ ఇంట్లో భారీగా ఆస్తులు గుర్తించిన ఏసీబీ అధికారులు**

**ఇప్పటివరకు రవీందర్ పేరిట రూ.50 కోట్లకు పైగా ఆస్తులు గుర్తించిన ఏసీబీ**



హెచ్‌ఎండీఏ సీఈ బచ్చు రవీందర్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. మైత్రివనంలో ఉన్న హెచ్‌ఎండీఏ కార్యాలయం, గచ్చిబౌలి సుమధుర టవర్స్‌లోని బచ్చు రవీందర్ నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో ఏక కాలంలో 15 బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. ఏసీబీ డీఎస్పీ మాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, నిజామాబాద్‌తో పాటు మరో 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. రవీందర్ ఇంట్లో భారీగా ఆస్తులు గుర్తించారు. రవీందర్ ఇంట్లో కిలో బంగారం, కిలోకు పైగా వెండి ఆభరణాలు, ఇప్పటివరకు రవీందర్ పేరిట రూ.50 కోట్లకు పైగా ఆస్తులు కొండాపూర్‌లో రెండు ప్లాట్లు, మసీద్‌బండలో 4 అంతస్తుల భవనం, సుమదుర అక్రోపోలిస్‌లో ఫ్లాట్, శ్రీవారి మెడాస్‌లో మరోఫ్లాట్, వాసవి అట్లాంటిస్‌లో ఫ్లాట్లు, శంషాబాద్, షాబాద్‌లో 4 ఎకరాల భూమి మసీదుబండలో 4 అంతస్థుల భవనం, జడ్చర్లలో 7 ప్లాట్లు, రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, 4 బ్యాంక్ లాకర్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇంట్లో రూ.4 లక్షల, 18 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.ఇప్పటికే సోదాల్లో విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు వాటిని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సాయంత్రం వరకు సోదాలు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. తనిఖీలు పూర్తైన తరువాత ఏ మేరకు ఆదాయానికి మించి ఆస్తులు రవీందర్ కలిగి ఉన్నారనేది తేలే అవకాశం ఉంది.

# తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు.. ఏబీ వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్

**ఏబీ వెంకటేశ్వరరావు కాల్ రికార్డింగ్స్ ను నిందితులు సేకరించినట్టు గుర్తించిన సిట్**

**సాక్షిగా వాంగ్మూలాన్ని నమోదు చేసిన పోలీసులు**

**కేసు దర్యాప్తు ముగింపునకు చేరుకున్నట్టు సమాచారం**



తెలంగాణ రాజకీయాలను షేక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ కేసులో ఏపీ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. 2023లో వెంకటేశ్వరరావు కాల్ డేటా రికార్డింగ్స్ ను నిందితులు సేకరించినట్టు సిట్ గుర్తించింది. దీంతో, సాక్షిగా ఆయన వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు.గత ఐదున్నర నెలలుగా అహర్నిశలు సాగిన దర్యాప్తులో సిట్ సంచలన నిజాలను వెలుగులోకి తెచ్చింది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు పలువురు పోలీసు మాజీ అధికారులు, రాజకీయ నేతలపై పక్కా సాక్ష్యాలతో తుది చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ కేసు నిందితుల జాబితాలో ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యుల్ని చేర్చినట్లు గతంలో ప్రచారం జరిగింది. పక్క రాష్ట్రానికి చెందిన బ్యూరోక్రాట్‌ను సిట్ విచారించడం ఇదే మొదటిసారి. ఈ కేసు దర్యాప్తు ముగింపునకు చేరుకుంటున్నట్లు సమాచారం. అనుబంధ అభియోగ పత్రం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఏపీలో పారిశ్రామిక విప్లవం

**8 కొత్త ప్రైవేట్ పార్కులకు కూటమి సర్కార్ గ్రీన్ సిగ్నల్**

**రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి కూటమి ప్రభుత్వం వ్యూహాలు**

**ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల విధానంతో అమలుకు సన్నాహాలు**

**రాష్ట్రంలో ఎనిమిది ప్రాంతాల్లో ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటు**



ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక విప్లవానికి కూటమి ప్రభుత్వం సరికొత్త ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల విధానంతో సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది ప్రాంతాల్లో ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త పాలసీ ద్వారా 4 వేల 196 ఎకరాల భూమి అందుబాటులోకి రానుండగా మౌలిక వసతుల కోసం రూ.1,720 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. లక్షల మందికి ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రత్యేక దృష్టి సారించి ఈ పార్కులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనను వేగవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త అడుగులు వేస్తోంది. కేవలం ప్రభుత్వమే భూములు సేకరించి పార్కులను అభివృద్ధి చేసే సంప్రదాయ పద్ధతికి స్వస్తి పలికి ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ఏపీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పాలసీని అమల్లోకి తెచ్చి 10 నుంచి వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో వీటిని నిర్మించేలా నిబంధనలు సరళతరం చేసింది.ప్రస్తుతం ఏపీఐఐసీ వద్ద కేవలం 40 వేల ఎకరాల భూమి మాత్రమే అందుబాటులో ఉంది. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో కొంతమేర భూములున్నా, పారిశ్రామికంగా డిమాండ్ ఉన్న కోస్తా జిల్లాల్లో భూమి దొరకడం గగనంగా మారింది. సమస్యను అధిగమించేందుకే ప్రైవేటు భూ యజమానులను భాగస్వామ్యులను చేస్తూ కోస్తాంధ్రలో పారిశ్రామిక పార్కులను వేగంగా అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది.ప్రభుత్వం అనుమతించిన 8 ప్రైవేటు పార్కుల్లో నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో అతిపెద్ద మెగా ప్రాజెక్టులు రాబోతున్నాయి. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2వేల 776 ఎకరాల విస్తీర్ణంలో రూ.870 కోట్ల పెట్టుబడితో ఇఫ్కో కిసాన్ సెజ్ ఏర్పాటు కానుంది. విజయనగరం జిల్లాలో 11 వందల 63 ఎకరాల్లో రూ.531 కోట్ల వ్యయంతో జేఎస్?డ ఇండస్ట్రియల్ పార్క్ రూపుదిద్దుకోనుంది.ఉత్తరాంధ్ర పారిశ్రామిక జోన్‌ను మరింత బలోపేతం చేస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మూడు కీలక పార్కులకు అనుమతులు లభించాయి. విశాఖలో 63 ఎకరాల్లో రూ.237 కోట్ల భారీ వ్యయంతో కె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రంగంలోకి దిగుతుండగా, అనకాపల్లిలో 93 ఎకరాల్లో వరాహ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కానుంది. ఈ ప్రాంతంలో అత్యాధునిక మౌలిక వసతుల కల్పనకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.ఈ సరికొత్త పారిశ్రామిక విధానంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో 13.7 ఎకరాల్లోనూ, అనకాపల్లి జిల్లాలో 32 ఎకరాల విస్తీర్ణంలోనూ రెండు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు ఏర్పాటు అవుతున్నాయి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ పార్కులలో ప్లగ్ అండ్ ప్లే మౌలిక వసతులను కల్పించనున్నారు.కోస్తాలోని కృష్ణా, పల్నాడు జిల్లాల్లోనూ నూతన పారిశ్రామిక హబ్‌లు అందుబాటులోకి రానున్నాయి. కృష్ణా జిల్లాలో 27 ఎకరాల విస్తీర్ణంలో రూ.12 కోట్ల వ్యయంతో శ్రీ వేద ఇన్నోవేషన్ పార్క్ ఏర్పాటు కాబోతోంది. పల్నాడు జిల్లాలో 27.8 ఎకరాల్లో అర్షధాతు గ్రీన్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' పేరిట పర్యావరణ అనుకూల గ్రీన్ టెక్నాలజీ పార్కు నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.రాష్ట్రానికి వస్తున్న భారీ పెట్టుబడుల ఒప్పందాలకు అనుగుణంగా భవిష్యత్తులో కనీసం 3.5 లక్షల ఎకరాల భూమి అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో కేవలం రాయలసీమలో అనుమతించిన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసమే 2.5 లక్షల ఎకరాల ప్రభుత్వ, డీకేటీ భూములను సేకరిస్తున్నారు. మిగిలిన పెట్టుబడుల కోసం మరో లక్ష ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసేలా పరిశ్రమల శాఖ వేగంగా అడుగులు వేస్తోంది.

# కారు ప్రయాణంలో సిద్ధమైన ప్లాన్.. అమెజాన్ పుట్టుక వెనక ఆసక్తికర విషయం!

**1994లో వాల్ స్ట్రీట్‌లో ఉద్యోగాన్ని వదిలేసిన జెఫ్ బెజోస్**

**భార్య మెకెంజీ స్కాట్‌తో కలిసి టెక్సాస్ నుంచి సియాటెల్‌కు కారులో ప్రయాణం**

**మెకెంజీ కారు నడుపుతుండగా, పక్క సీటులో కూర్చున్న బెజోస్**

**ల్యాప్‌టాప్‌లో అమెజాన్‌కు సంబంధించిన 30 పేజీల బిజినెస్ ప్లాన్ సిద్ధం**

**ఇంటి గ్యారేజ్‌లో 'కాడాబ్రా' పేరిట సంస్థ ప్రారంభం**

**పుస్తకాల అమ్మకాలతో ప్రారంభమైన అమెజాన్ వెబ్‌సైట్**




ప్రపంచంలోనే అతిపెద్ద ఈ-కామర్స్ సంస్థల్లో ఒకటైన అమెజాన్ ఆరంభం ఓ 2,000 మైళ్ల కారు ప్రయాణంలో జరిగింది. 1994లో వాల్ స్ట్రీట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఉద్యోగాన్ని వదిలేసిన జెఫ్ బెజోస్, తన భార్య మెకెంజీ స్కాట్‌తో కలిసి టెక్సాస్ నుంచి సియాటెల్‌కు కారులో బయలుదేరారు. ప్రయాణమంతా మెకెంజీ కారు నడుపుతుండగా, పక్క సీటులో కూర్చున్న బెజోస్ ల్యాప్‌టాప్‌లో అమెజాన్‌కు సంబంధించిన 30 పేజీల బిజినెస్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. అదే ప్రయాణం ప్రపంచ రిటైల్ రంగ చరిత్రను మార్చిన మలుపుగా నిలిచింది. అప్పటికి డి.ఈ. షా అండ్ కో సంస్థలో అత్యంత పిన్న వయస్కుడైన సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న బెజోస్ నేటి విలువ ప్రకారం సంవత్సరానికి 15-20 లక్షల డాలర్లకు సమానమైన వేతనం పొందుతున్నారు. అయినప్పటికీ ఇంటర్నెట్ భవిష్యత్తుపై నమ్మకంతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఆన్‌లైన్ బుక్‌స్టోర్ ఆలోచనను వివరించగానే బెజోస్‌లోని ఉత్సాహం తనకు స్పష్టంగా కనిపించిందని, వెంటనే ఆ ప్రయాణానికి సిద్ధమయ్యానని మెకెంజీ స్కాట్ ఓసారి గుర్తుచేశారు. సియాటెల్ సమీపంలోని బెల్లెవ్యూ చేరుకున్న తర్వాత బెజోస్ తన ఇంటి గ్యారేజ్‌లో సంస్థను ప్రారంభించారు. తొలుత 'కాడాబ్రా' అనే పేరును నమోదు చేశారు. తర్వాత దక్షిణ అమెరికాలోని అమెజాన్ నది పేరును సంస్థకు పెట్టారు. మొదట పుస్తకాల అమ్మకాలతో ప్రారంభమైన అమెజాన్ వెబ్‌సైట్ 1995 జులైలో ప్రారంభమైంది. ఆ తర్వాత సంగీతం, ఎలక్ట్రానిక్స్, ఇతర వినియోగ వస్తువుల విక్రయాల్లోకి విస్తరించింది. 1997లో నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ కావడంతో సంస్థ వేగంగా విస్తరించి ప్రపంచ ఈ-కామర్స్ రంగంలో అగ్రస్థానానికి చేరుకుంది. అమెజాన్ తొలి రోజుల్లో మెకెంజీ స్కాట్ కీలక బాధ్యతలు నిర్వహించారు. కారు నడపడమే కాకుండా కంపెనీ అకౌంట్స్ నిర్వహించడం, ఉద్యోగులకు చెక్కులు జారీ చేయడం, లెక్కలు చూసుకోవడం, ఉద్యోగ నియామకాల్లో పాల్గొనడం, రవాణా ఒప్పందాలు కుదుర్చడం వంటి పనులను నిర్వహించారు. అనంతరం అమెజాన్ క్లౌడ్ సేవలు (ఏడబ్ల్యూఎస్), డెలివరీ నెట్‌వర్క్, స్ట్రీమింగ్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో విస్తరించి ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీల్లో ఒకటిగా ఎదిగింది. 2021లో సీఈఓ పదవి నుంచి వైదొలగిన బెజోస్ ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

# భారత్- యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలు

**దేశీయ మార్కెట్లకు, ఐటీ రంగానికి కొత్త ఊపు**

**ఈ ఒప్పందంతో భారతీయ వినియోగదారులకు భారీ ఉపశమనం**

**ఆటోమొబైల్ రంగాలకు సరికొత్త అడుగు- ఐటీ దిగ్గజాలకు భారీ ప్రయోజనం**




భారత్, యూకే మధ్య కుదిరిన చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం బుధవారం నుంచే అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం వల్ల బ్రిటన్‌కు భారత్ చేసే ఎగుమతుల్లో 99 శాతం వస్తువులపై ఎలాంటి సుంకాలు ఉండవు. బ్రిటిష్ వస్తువులకు ఒకటి నుంచి పదేళ్లలో దశల వారీగా సుంకాల మినహాయింపు లభించనుంది. ఫలితంగా దేశీయ మార్కెట్లకు, ఐటీ రంగానికి కొత్త ఊపు రానుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్-యూకే ఒప్పందం అమలు దేశీయ పారిశ్రామిక రంగానికి కొత్త శక్తిని ఇవ్వనుంది. ఈ ఒప్పందం వల్ల ఎక్కువ శ్రామికులు ఉండే రంగాలైన వస్త్రాలు, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, మసాలా దినుసులు, మాంసం, సముద్ర ఆహార ఉత్పత్తులపై బ్రిటన్ ప్రభుత్వం సుంకాలు పూర్తిగా ఎత్తివేసింది. ప్రస్తుతం ఈ వస్తువుల దిగుమతులపై బ్రిటన్‌లో 4 నుంచి 16 శాతం వరకు కస్టమ్స్ సుంకాలు విధిస్తుండగా జులై 15 నుంచి ఇవన్నీ జీరో డ్యూటీతో బ్రిటన్ మార్కెట్లోకి ప్రవేశిస్తాయి. తద్వారా భారతీయ ఉత్పత్తుల ధరలు తగ్గి అక్కడ డిమాండ్ విపరీతంగా పెరగనుంది. ఇవేకాకుండా ఆటోమొబైల్స్, మోటార్ సైకిళ్లు, విడిభాగాలు, మెషినరీ, ఎలక్ట్రానిక్స్, సిరామిక్స్, గ్లాస్, సిమెంట్ పరిశ్రమలకు కూడా ఈ ఒప్పందం ద్వారా భారీ లబ్ధి చేకూరనుంది. భారత్- యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కేవలం ఎగుమతిదారులకే కాకుండా భారతీయ వినియోగదారులకు కూడా భారీ ఉపశమనం కలిగించనుంది. బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతయ్యే ప్రీమియం వస్తువుల ధరలు దశల వారీగా గణనీయంగా తగ్గిపోనున్నాయి. ముఖ్యంగా బ్రిటీష్ సాల్మన్ చేపలు, గొర్రె మాంసం, చాక్లెట్లు, సాఫ్ట్ డ్రింక్స్, కాస్మెటిక్స్, లగ్జరీ సబ్బులు, సుగంధ ద్రవ్యాలు, షేవింగ్ క్రీమ్‌లు, నెయిల్ పాలిష్ వంటి వస్తువుల ధరలు అందుబాటులోకి రానున్నాయి. బ్రిటన్ నుంచి దిగుమతయ్యే వెండిపై సుంకాన్ని రానున్న 10 ఏళ్లలో పూర్తిగా సున్నా శాతానికి తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. భారత ఆటోమొబైల్ రంగం చరిత్రలోనే మొదటిసారిగా బ్రిటన్ నుంచి పూర్తిగా తయారై వచ్చేకార్లు, ట్రక్కుల దిగుమతి సుంకాలను భారీగా తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. ప్రస్తుతం ఉన్న 110 శాతంగా ఉన్న కార్ల దిగుమతి సుంకం విడతల వారీగా కేవలం 10 శాతానికి తగ్గించనున్నారు. భారతీయ ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారుల్నిరక్షించేందుకు భారత్ ఒక వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. యూకే నుంచి దిగుమతయ్యే పెట్రోల్, డీజిల్ వాహనాలకు మొదటి ఏడాది నుంచే రాయితీలు లభిస్తుండగా బ్రిటన్ ఈవీ, హైబ్రిడ్, హైడ్రోజన్ కార్లకు ఆరో సంవత్సరం నుంచి మాత్రమే ఈ రాయితీలు వర్తిస్తాయి. దీనివల్ల దేశీయ ఈవీ కంపెనీలకు 5 ఏళ్ల పాటు మార్కెట్ రక్షణ లభిస్తుంది. మొదటి 15 ఏళ్లలో రూ. 3.78 లక్షల సంప్రదాయ ఇంజిన్ కార్ల దిగుమతికి మాత్రమే రాయితీ వర్తిస్తుంది. దిగుమతి సుంకం తగ్గడంతో టాటా సంస్థ తమ జాగ్వార్ ల్యాండ్ రోవర్ కార్ల ధరలను రూ. 70 లక్షల నుంచి రూ. 1.06 కోట్ల వరకూ తగ్గించింది. అలాగే బ్రిటన్ ట్రక్కులపై ఉన్న 44% సుంకం 5 ఏళ్లలో 8.8 శాతానికి తగ్గుతుంది. ప్రతిగా, బ్రిటన్ కూడా భారతీయ ఈవీ, హైబ్రిడ్ కార్లకు వార్షిక కోటా పరిధిలో పూర్తిగా సుంకం లేని ప్రవేశాన్ని కల్పించింది. దీనివల్ల భారత వాహనాలకు బ్రిటన్ మార్కెట్లో 10 శాతం ధరల ప్రయోజనం లభిస్తుంది. బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతయ్యే ప్రీమియం మద్యం రకాలైన స్కాచ్ విస్కీ, బ్రాందీ, బోర్బన్, రమ్, జిన్, వోడ్కా, టెకిలాపై ప్రస్తుతం ఉన్న 150 శాతం సుంకం, మొదటి ఏడాది 110 శాతానికి, పదో సంవత్సరానికి 75 శాతానికి తగ్గుతుంది. అయితే ఇది కేవలం లీటరుకు 5 డాలర్లు కనీస దిగుమతి ధర ఉండే ప్రీమియం బ్రాండ్లకు మాత్రమే వర్తిస్తుంది. స్కాచ్ విస్కీపై సుంకం 150 శాతం నుంచి విడతల వారీగా 40 శాతానికి దిగిరానుంది. ఈ ఒప్పందం ద్వారా భారత ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్ ప్రకారం భారతీయ కంపెనీలు తమ ఉద్యోగులను తాత్కాలికంగా గరిష్ఠంగా 5 ఏళ్ల వరకు బ్రిటన్ బ్రాంచ్‌లకు పంపినప్పుడు, వారి తరఫున బ్రిటన్‌లో ఎలాంటి సామాజిక భద్రతా పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. భారత్‌లోని కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన రవాణా, గ్రీన్ ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో దాదాపు 40 వేల హైవాల్యూ ప్రభుత్వ కాంట్రాక్టుల టెండర్లలో పాల్గొనేందుకు బ్రిటన్ కంపెనీలకు భారత్ మొదటిసారి అవకాశం కల్పించింది. చైనా వంటి మూడో దేశాలు తమ వస్తువులను భారత్ లేదా బ్రిటన్ మార్గాల ద్వారా దొంగచాటుగా మార్కెట్లోకి పంపి లాభపడకుండా కఠిన నిబంధనలు రూపొందించారు. కేవలం భారత్ లేదా బ్రిటన్లలోనే వాస్తవంగా తయారైన లేదా ప్రాసెస్ చేసిన వస్తువులకు మాత్రమే పన్నుమినహాయింపులు వర్తిస్తాయి. అయితే భారత్ రైతుల రక్షణ కోసం ఆపిల్స్, వాల్‌నట్స్, బ్లూ-వీన్డ్ చీజ్, స్మార్ట్‌ఫోన్లు, బంగారం బిస్కెట్లపై ఎలాంటి పన్నులు తగ్గించడంలేదు. బ్రిటన్ కూడా బియ్యం, చక్కెర, మాంసం, గుడ్ల ఉత్పత్తులను సుంకాల తగ్గించడం లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-బ్రిటన్ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 8.62 శాతం వృద్ధితో 25.12 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అలాగే బ్రిటన్ నుంచి వచ్చే ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు కూడా 1 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఈ నేపథ్యంలో జులై 15 నుంచి అమల్లోకి రానున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేయనుంది. రానున్న రోజుల్లో భారత ఎగుమతులకు సరికొత్త గమ్యస్థానంగా బ్రిటన్‌ను మార్చనుంది.

# రిటైర్మెంట్‌కు 5 ఏళ్ల ముందే ఈ పనులు చేయాలట!

**పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారా**

**రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతమైన జీవితం గడిపేందుకు ముందే ఈ పనులు పూర్తి చేయాలని చెబుతోన్న నిపుణులు!**



పదవీ విరమణ అనగానే ప్రశాంతమైన జీవితమే గుర్తుకొస్తుంది. అప్పటివరకు విధి నిర్వహణలో నిమగ్నమైన వారు మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా గడపాలను కోరుకుంటారు. అయితే ఆ ప్రశాంతత కోసం సరైన ఆర్థిక ప్రణాళిక ఎంతో అవసరమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే రిటైర్మెంట్‌కు సరిగ్గా ఐదు సంవత్సరాల సమయం ఉందనగా, ఆర్థిక వ్యూహాల్లో కీలక మార్పులు చేసుకోవాలంటున్నారు. అప్పటివరకూ సంపద సృష్టి కోసం చేసే ప్రయత్నాల నుంచి, సంపాదించిన మూలధనాన్ని రక్షించుకునే దిశగా అడుగులు పడాలంటున్నారు. ఈ క్రమంలోనే పదవీ విరమణకు 5 ఏళ్లు ముందు ఏం చేయాలో వివరిస్తున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం. పదవీ విరమణకు ముందు ఐదేళ్ల సమయం ఒక ముఖ్యమైన మైలురాయిలాంటిదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇది సంపదను పోగు చేసే దశ నుంచి, దాన్ని రక్షించుకుంటూ స్థిరమైన ఆదాయాన్ని పొందే దశకు మారే పరివర్తన సమయం అంటున్నారు. ఈ దశలో పెట్టుబడిదారులు అధిక వృద్ధి కోసం చేసే వ్యూహాలను పక్కనపెట్టి, కూడబెట్టిన మొత్తంతో వచ్చే రాబడి.. భవిష్యత్తు జీవనశైలి ఖర్చులకు సరిపోయేలా చూసుకోవాలంటున్నారు. పదవీ విరమణ నిధిని నిర్మించేందుకు షేర్ల వంటి వృద్ధి-ఆధారిత పెట్టుబడులు అవసరమే అయినప్పటికీ, రిటైర్మెంట్‌కు దగ్గరపడుతున్న కొద్దీ విధానం మారాలంటున్నారు. ఒకవేళ స్టాక్ మార్కెట్ నష్టాలపాలైతే, తిరిగి కోలుకోవడానికి తగినంత సమయం లేనప్పుడు నష్టభయం కారణంగా పెట్టుబడిదారులు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డెట్ మ్యూచువల్ ఫండ్లు, ప్రభుత్వ మద్దతున్న పథకాలవంటి సురక్షితమైన మార్గాల వైపు మళ్లుతుంటారని వివరిస్తున్నారు. అయితే ఈ సురక్షితమైన ఆస్తులతో పాటు ద్రవ్యోల్బణం అనే ప్రమాదమూ పొంచి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు. పెట్టుబడులు ద్రవ్యోల్బణం రేటు కంటే ఎక్కువ రాబడిని అందించకపోతే, కాలక్రమేణా ఆ డబ్బు కొనుగోలు శక్తి పడిపోతుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, పెట్టుబడులకు భద్రత కల్పిస్తూనే ద్రవ్యోల్బణాన్ని అధిగమించేలా తగినంత వృద్ధిని సాధించడం ఈ దశలో ఒక ముఖ్యమైన సవాలుగా చెబుతున్నారు. పదవీ విరమణ భద్రతకు అధిక వడ్డీల అప్పులు అతిపెద్ద ముప్పని హెచ్చరిస్తున్నారు. క్రెడిట్ కార్డు లేదా వ్యక్తిగత రుణం వంటి బాకీలను రిటైర్మెంట్ తర్వాత వచ్చే డబ్బును వేగంగా హరించివేస్తాయంటున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన ఆదాయ మార్గమైన జీతం ఆగిపోకముందే ఇలాంటి అప్పులన్నింటినీ పూర్తిగా తీర్చేయడం చాలా ముఖ్యమంటున్నారు. ఒకవేళ మీరు భారీ అప్పులతో పదవీ విరమణ దశలోకి ప్రవేశిస్తే, ఆ అప్పులు తీర్చేందుకు పెట్టుబడులను అమ్ముకోవాల్సి రావొచ్చని లేదా జీవన ప్రమాణాలను తగ్గించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి బ్యాలెన్స్ షీట్ అప్పుల్లేకుండా ఉంటేనే, వడ్డీలు చెల్లించే బాధ ఉండదని, రిటైర్మెంట్ డబ్బును జీవన వ్యయాల కోసమే వాడుకోవచ్చని సలహా ఇస్తున్నారు. పదవీ విరమణ ప్రణాళికలో ఆరోగ్య సంరక్షణ ఖర్చులు అతి పెద్ద సవాలుగా మారుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో సాధారణ ద్రవ్యోల్బణం కంటే వైద్యానికి అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో పదవీ విరమణ దగ్గరపడుతున్నవారు కేవలం తమ యాజమాన్యం అందించే ఆరోగ్య బీమాపైనే ఆధారపడటం చాలా పెద్ద పొరపాటు అని హెచ్చరిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేయడానికి చాలా ముందుగానే సొంతంగా, సమగ్ర ఆరోగ్య బీమా కవరేజీని తీసుకోవడం అత్యవసరం అని సూచిస్తున్నారు. ముందుగానే పాలసీ తీసుకోవడం వల్ల తక్కువ ప్రీమియం చెల్లించే వీలుంటుందని, ముందునుంచీ ఉన్న వ్యాధుల విషయంలో వేచి ఉండే వ్యవధి సమస్యనూ అధిగమించవచ్చని సలహా ఇస్తున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే తప్ప ఆర్థిక పత్రాలను చాలామంది పట్టించుకోరు. కానీ ఈ దశలో ఆర్థిక రికార్డులను ఒకసారి సమగ్రంగా తనిఖీ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంకు అకౌంట్లు, బీమా పాలసీలు, పెట్టుబడుల వివరాలన్నింటికీ కచ్చితమైన నామినేషన్లు ఉన్నాయో లేదా సరిచూసుకోవాలంటున్నారు. స్పష్టమైన నామినేషన్లు లేకపోతే, కుటుంబం తీవ్రమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. డిజిటల్, భౌతిక ఆర్థిక రికార్డులన్నింటినీ ఒకే చోట (సెంట్రల్ రిపోజిటరీ వద్ద) భద్రపర్చడం లేదా వాటి వివరాలను నమ్మకమైన కుటుంబ సభ్యుడికి తెలియజేయడం వల్ల, అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబసభ్యులపై భారం చాలా వరకూ తగ్గుతుందని వివరిస్తున్నారు.

## ఏడు నెలల్లో మూడోసారి.. థార్ ధరలు మళ్లీ పెరిగాయి!

**గరిష్ఠంగా రూ.37 వేల వరకు పెంపు**

**జులై 10 నుంచి కొత్త ధరలు అమలు**

**థార్ ధర రూ.10.32 లక్షల నుంచి ప్రారంభం**

**ముడి సరకుల ధరల పెరుగుదలే కారణమని కంపెనీ వెల్లడి**




మహీంద్రా థార్‌ను కొనాలని భావిస్తున్న వారికి కంపెనీ మరో షాక్ ఇచ్చింది. కేవలం ఏడు నెలల్లోనే మూడోసారి ధరలు పెంచింది. ఈసారి వేరియంట్‌ను బట్టి గరిష్ఠంగా రూ. 37 వేల వరకు సవరించింది. కొత్త ధరలు జులై 10 నుంచి అమల్లోకి వచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. తాజా ధరల పెంపు థార్‌లోని అన్ని వేరియంట్లకు వర్తిస్తుందని మహీంద్రా తెలిపింది. ముడి సరకుల ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇంజిన్, గేర్‌బాక్స్, డ్రైవ్‌ట్రెయిన్ ఆధారంగా ధరల పెంపు మారుతోంది. టాప్ ఎండ్ ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ 2.2 డీజిల్ ఆటోమేటిక్ వేరియంట్‌పై అత్యధికంగా రూ. 37 వేలు పెంచింది. ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ పెట్రోల్ ఆటోమేటిక్‌పై రూ. 36 వేలు, ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ డీజిల్ మాన్యువల్‌పై రూ. 34 వేల వరకు పెంచింది. ప్రస్తుతం థార్ ఎక్స్‌షోరూమ్ ధర రూ. 10.32 లక్షల నుంచి ప్రారంభమై, టాప్ వేరియంట్‌కు రూ. 17.99 లక్షల వరకు ఉంది. ఎంట్రీ లెవల్ ఏఎక్స్‌టీ 2డబ్ల్యూడీ డీజిల్ మాన్యువల్ వేరియంట్ ధర రూ. 10.32 లక్షలు కాగా, టాప్ స్పెక్ ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ డీజిల్ ఆటోమేటిక్ ధర రూ. 17.99 లక్షలకు చేరింది. ఈ ఏడాది థార్ ధరలు పెరగడం ఇది మూడోసారి. జనవరిలో రూ. 20 వేల వరకు, ఏప్రిల్‌లో రూ. 43 వేల వరకు ధరలు పెంచిన కంపెనీ ఇప్పుడు మరోసారి ధరలను సవరించింది. దీంతో ఏడు నెలల వ్యవధిలోనే మూడు సార్లు ధరలు పెరిగినట్లైంది. థార్‌ను కొనుగోలు చేయాలనుకునే వారు బుకింగ్‌కు ముందు తాజా ఆన్‌రోడ్ ధరను డీలర్ వద్ద ఒకసారి నిర్ధారించుకోవడం మంచిదని కంపెనీ సూచించింది.

## బీఎస్ఎన్ఎల్‌కు నెలకు ఒక్కో యూజర్ నుంచి ఎంత ఆదాయం వస్తుందో తెలుసా


**ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 10 శాతం పెరిగిన బీఎస్ఎన్ఎల్ ఆదాయం**

**కార్యకలాపాల ద్వారా రూ. 4,418 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు వెల్లడి**

**గతేడాదితో పోలిస్తే ఇది రూ. 401 కోట్లు అధికం**

**గతంలో రూ. 100గా ఉన్న ఏఆర్‌పీయూ ప్రస్తుతం రూ. 102.7కు చేరిక**



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పనితీరులో సానుకూల వృద్ధి కనిపిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) సంస్థ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం దాదాపు 10 శాతం పెరిగినట్లు కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ తొలి త్రైమాసిక పనితీరుపై జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బీఎస్ఎన్ఎల్ రూ. 4,017 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయగా, ఈ ఏడాది అదే కాలానికి అది రూ. 4,418 కోట్లకు చేరిందని సింధియా తెలిపారు. తద్వారా సంస్థ ఆదాయంలో రూ. 401 కోట్ల పెరుగుదల నమోదైందని వివరించారు. ఈ వృద్ధికి ప్రధానంగా ఎంటర్‌ప్రైజ్ బిజినెస్, కన్స్యూమర్ మొబిలిటీ విభాగాలు దోహదపడినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, కన్స్యూమర్ ఫిక్స్‌డ్ యాక్సెస్ విభాగంలో మాత్రం వృద్ధి దాదాపు నిలకడగా ఉందని చెప్పారు. ఈ త్రైమాసికంలో బీఎస్ఎన్ఎల్ ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) కూడా పెరిగినట్లు మంత్రి తెలిపారు. గతంలో రూ. 100గా ఉన్న ఏఆర్‌పీయూ, రూ. 102.7కు చేరిందని ఆయన పేర్కొన్నారు. సంస్థ పనితీరును మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

## నష్టాల నుంచి గట్టెక్కిన సూచీలు.. స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్లు

**రోజులో నష్టాల నుంచి కోలుకుని ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి వచ్చిన సూచీలు**

**ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**ముడి చమురు ధరల పెరుగుదలతో క్షీణించిన రూపాయి విలువ**



దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ ట్రేడింగ్‌ను స్వల్ప లాభాలతో ముగించాయి. రోజంతా తీవ్ర ఒడిదొడుకులకు లోనైన సూచీలు, చివరి గంటలో ఐటీ షేర్లలో వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో నష్టాల నుంచి బయటపడి ఫ్లాట్‌గా ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఉన్నప్పటికీ, ఐటీ రంగం మార్కెట్లను నిలబెట్టింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 47.01 పాయింట్లు లాభపడి 77,616.40 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 4.10 పాయింట్లు మాత్రమే పెరిగి 24,211 వద్ద నిలిచింది. రోజు మధ్యలో సూచీలు నష్టాల్లోకి జారుకున్నప్పటికీ, చివరి సెషన్‌లో పుంజుకోవడం గమనార్హం. ఈరోజు ట్రేడింగ్‌లో ఐటీ రంగం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా వంటి అగ్రశ్రేణి ఐటీ కంపెనీల షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. దీంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ మిగిలిన రంగాల కంటే మెరుగైన పనితీరు కనబరిచింది. దీనికి విరుద్ధంగా నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ మెటల్ సూచీలు అమ్మకాల ఒత్తిడితో నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్‌లోనూ సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.01 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.03 శాతం స్వల్ప లాభాలతో ముగిశాయి. ఇదిలా ఉంటే.. కరెన్సీ మార్కెట్‌లో రూపాయి విలువ భారీగా క్షీణించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు 4 శాతానికి పైగా పెరగడంతో భారత్ దిగుమతుల బిల్లుపై ఆందోళనలు పెరిగాయి. ఫలితంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 0.26 శాతం బలహీనపడి 95.60 వద్ద ట్రేడ్ అయింది. సమీప భవిష్యత్తులో రూపాయి 95.20--96.00 శ్రేణిలో కదలాడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.




# ‘దండోరా’ దర్శకుడితో సినిమా?

గత కొంతకాలంగా సరైన విజయాలు లేక నిరుత్సాహంలో ఉన్నారు హీరో నితిన్. గత ఏడాది విడుదలైన ‘తమ్ముడు’ కూడా పరాజయంపాలైంది. వరుస ఫెయిల్యూర్స్‌తో సినిమాలకు ఏడాది పాటు గ్యాప్ తీసుకున్న నితిన్.. ఇటీవలే మూడు సినిమాలకు ఓకే చెప్పిన విషయం తెలిసిందే. అందులో ఓ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై హీరో నాని తెరకెక్కించబోతున్నారు. ‘దండోరా’ ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తాడు. ‘దండోరా’ తరహాలోనే తెలంగాణ నేపథ్యంలో సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగే సినిమా ఇదని సమాచారం. ఇందులో నితిన్‌కు జోడీగా రుక్మిణి వసంత్ నటించబోతున్నది. గ్లామర్ హంగులకు దూరంగా పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్‌గా ఆమె పాత్ర సాగుతుందని చెబుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ఆగస్ట్‌లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సమాచారం.

# నాగచైతన్య కొత్త సినిమా?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య ‘వృషకర్మ’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ‘బెదురులంక 2012’ చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే ‘మసూద’ దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా ‘మసూద’తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.






# మా అమ్మ భావోద్వేగానికి గురయ్యారు: భాగ్యశ్రీ బోర్సే

“లెనిన్’ సినిమా విజయం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. నేను చేసిన భారతి పాత్ర పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ జీవితాంతం మర్చిపోలేను. ‘లెనిన్’లో నా నటన పట్ల మా అమ్మానాన్నలు చాలా సంతోషంగా ఉన్నారు. మా అమ్మగారు నాకు ఫోన్ చేసి, ‘సినిమా చాలా బాగుంది.. నీ నటన కూడా ఎంతో బాగా అనిపించింది’ అన్నారు. అయితే భారతి పాత్ర ముగింపు చూసి ఒక తల్లిగా చాలా భావోద్వేగానికి గురయ్యారు. ఎందుకంటే అలాంటి ముగింపును ఏ తల్లి కూడా కోరుకోదు కదా?” అని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే పేర్కొన్నారు. అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం ‘లెనిన్’. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో భారతి పాత్ర పోషించిన భాగ్యశ్రీ బోర్సే చెప్పిన విశేషాలు...

“లెనిన్’ కథని మురళీ కిషోర్‌గారు చెప్పినప్పుడే నా మనసుకు హత్తుకుంది. భారతి పాత్రలో నటనకు మంచి అవకాశం ఉందని అప్పుడే అనిపించింది. ఇప్పుడు ప్రేక్షకులు ఆ పాత్రను ఇంతగా అభిమానించడం చాలా సంతోషంగా ఉంది. భారతి పాత్ర గురించి అందరూ ఎంతో ప్రేమగా మాట్లాడుతున్నారు. నాగార్జునగారు నా నటన గురించి మాట్లాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రశంసలు నాకు సంతోషంతో పాటు మరింత బాధ్యతను కూడా పెంచాయి. ఋలెనిన్--భారతిల ప్రేమకథే ‘లెనిన్’. అఖిల్, నా పాత్రలు తెరపై చాలా సహజంగా కనిపించేలా ప్రతి సన్నివేశంపై ఎంతో శ్రద్ధ పెట్టి పనిచేశాం. భవిష్యత్తులో మహారాణి, యువరాణి వంటి పాత్రలు చేయాలని ఉంది. అలాంటి చిత్రాల విషయంలో రాజమౌళిగారు మాస్టర్. ఏదో ఒక రోజు ఆయన దర్శకత్వంలో నటించాలని ఉంది. ‘మా ఇంటి బంగారం’ సినిమాలో సమంతగారు అద్భుతంగా నటించారు. మాలాంటి కొత్త నటీమణులకు ఆమె ఒక దారి చూపించారు. అవకాశం వస్తే అలాంటి మహిళా ప్రధాన పాత్రలు కూడా చేయాలని ఉంది. ప్రస్తుతం శివ కార్తికేయన్‌తో తమిళంలో ‘సీయోన్’ సినిమా చేస్తున్నాను. అలాగే తెలుగు, తమిళ భాషల్లో మరికొన్ని కథలు వింటున్నాను. వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాను.

# ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘కొరియన్ కనకరాజు’. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.

EDITOR, PRINTER AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri -515411,Anantapur District Andra Pradesh,Published at #1/111, SC PETA,RAMPAYARRAM PALEM,GOKARAM (V&P),GOKARAM (M), GOKARAM.EAST GODAVARI-533286Andra Pradesh EDITOR B.JAVEED BASHA PRGI. NO : APTEL/26/A4786, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com